


RNI : APTEL/2023/87662

# సింధూర దర్శిని

జాతీయ తెలుగు దినపత్రిక

ప్రతి అక్షరం అవినీతి పై సమరం

WWW.SINDHURADARSINI.COM WWW.EPAPER.SINDHURADARSINI.COM

**విలేకరులు కావలెను**

సింధూరదర్శిని జాతీయ తెలుగు దినపత్రికలో జిల్లాల వారీగా పనిచేయుటకు జిల్లా ఇన్చార్జీలు మరియు మండలాల వారీగా పనిచేయుటకు విలేకరులు కావలెను. ఎలాంటి వేతనం ఇవ్వబడదు. యాడ్స్ పై ఆకర్షణీయమైన కమిషన్ ఇవ్వబడును. అనుభవం ఉన్న వారికి ప్రాధాన్యత ఇవ్వబడును. వివరాల కొరకు బయోడేటాతో క్రింది నంబర్‌ను సంప్రదించండి.

సెల్ నెంబర్ : 7 5 6 9 6 7 7 1 7 0

ప్రచురణ: తిరుపతి సంపుటి:3 సంచిక :299 సంపాదకులు: కలిచేటి వెంకయ్య శుక్రవారం 25 సెప్టెంబర్ 2026 పేజీలు: 8 వెల:2

Circulated At :Tirupathi, Chittoor, Kadapa, SPSR Nellore, karnool, Prakasam, Hydrabad

# ఎన్నికల సంఘం యాప్‌పై మరోసారి వివాదం

ఓటు హక్కులు హరించివేస్తున్నారని శశి థరూర్ ఫైర్

ఎన్నికల సంఘం తీసుకొచ్చిన ECINet సాఫ్ట్‌వేర్‌పై వివాదం

పేర్ల తొలగింపు, కొత్త ఓటర్ల చేరిక అన్నీ ఎన్నికల ప్రధాన కమిషనర్ స్థాయిలోనే జరుగుతున్నాయని ఆరోపణలు

పౌరుల ప్రాథమిక హక్కులు ప్రమాదంలో పడుతున్నాయన్న శశి థరూర్



**న్యూఢిల్లీ:** ఎన్నికల సంఘం తీసుకొచ్చిన ECINet సాఫ్ట్‌వేర్‌పై మళ్లీ తీవ్ర వివాదం చెలరేగింది. కొత్త ఓటర్ల చేరిక, పేర్ల తొలగింపు వంటి నిర్ణయాలు ప్రధాన కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ స్థాయిలోనే జరుగుతున్నాయని, మిగతా ఇద్దరు కమిషనర్లకు సమాచారం కూడా అందడం లేదన్న ఆరోపణలు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ ఎంపీ శశి థరూర్ ఆ సాఫ్ట్‌వేర్‌ను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. గోవాలో జరిగిన ఘటనే ఈ వివాదానికి కారణం. ప్రత్యేక సమగ్ర సవరణ (SIR) సమయంలో కొన్ని పేర్లపై సాఫ్ట్‌వేర్ అభ్యంతరాలు చూపింది. క్షేత్రస్థాయిలో సరిగ్గా పరిశీలించిన తర్వాత 97 మంది ఓటర్లు అర్హులేనని స్థానిక అధికారులు నిర్ధారించారు. కానీ వారి పేర్లను తిరిగి చేర్చేందుకు అవసరమైన రోల్‌బ్యాక్ సౌకర్యం యాప్‌లో లేదు. దీంతో గోవా ప్రధాన ఎన్నికల అధికారి ఢిల్లీలోని ఎన్నికల సంఘానికి పదేపదే అభ్యర్థనలు పంపారు. అయినా అనుమతి రాకపోవడంతో ఆ పేర్లు జాబితాలోకి రాలేకపోయాయి. యాప్‌పై పూర్తి నియంత్రణ ఢిల్లీ వద్దే ఉందని సమాచారం. ఓటరు జాబితాలో పేరు లేకపోతే కేవలం ఓటు మాత్రమే కాదు... గోవా మెడిక్లెయిమ్ పథకం కింద డయాలసిస్, గుండె

మిగతా 2లో...

## యుద్ధాన్ని హిందూ మహాసముద్రానికి విస్తరిస్తామన్న

# ఇరాన్..భారత్‌పై ప్రభావం ఎంత?

భారత్ ఇంధన దిగుమతులు, వాణిజ్య మార్గాలపై తీవ్ర ప్రభావం చూపే అవకాశం

ఇరాన్ సుప్రీం లీడర్ సలహాదారు నుంచి వచ్చిన కీలక హెచ్చరిక

ఇప్పటికే పర్షియన్ గల్ఫ్ నుంచి ఎర్ర సముద్రానికి విస్తరించిన ఉద్రిక్తతలు

భారత్‌కు చమురు ధరలు, రవాణా ఖర్చులు పెరిగే ప్రమాదం



**సింధూరదర్శిని:** మధ్యప్రాచ్యంలో కొనసాగుతున్న సంక్షోభం మరింత విస్తరించే ప్రమాదం కనిపిస్తోంది. ఈ యుద్ధం హిందూ మహాసముద్రం వరకు కూడా వ్యాపించవచ్చని ఇరాన్ తీవ్ర హెచ్చరికలు జారీ చేసింది. ఈ పరిణామం భారత్ ఇంధన దిగుమతులు, సముద్ర వాణిజ్యంపై తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. ఒకవేళ ఉద్రిక్తతలు హిందూ మహాసముద్రానికి వ్యాపిస్తే, అది భారత వాణిజ్య, ఇంధన భద్రతకు పెను సవాలుగా మారే అవకాశం ఉంది. ఇరాన్ సుప్రీం లీడర్ అయతొల్లా అలీ ఖమేనీకి సలహాదారుగా ఉన్న యహ్యా రహీం సఫావి ఈ హెచ్చరికలు జారీ చేశారు. అమెరికా లేదా ఇజ్రాయెల్ మరిన్ని దాడులకు పాల్పడితే, యుద్ధాన్ని మరింత విస్తృతం చేస్తామని ఆయన స్పష్టం చేశారు. "ఈ పోరాటం ఇప్పటికే పర్షియన్ గల్ఫ్, హార్మూజ్ జలసంధి నుంచి ఎర్ర సముద్రానికి విస్తరించింది. యుద్ధం కొనసాగితే, హిందూ మహాసముద్రం, ఆపై ప్రాంతాలకు కూడా వ్యాపించే అవకాశం ఉంది" అని ఆయన పేర్కొన్నట్లు ఇరాన్‌కు చెందిన ఫార్స్ న్యూస్ ఏజెన్సీ ఓ వీడియోను విడుదల చేసింది. ఇరాన్ అత్యున్నత స్థాయి అధికారి ఒకరు హిందూ మహాసముద్రం గురించి

మిగతా 2లో...

# బీసీ బిడ్డలను కంటికి రెప్పలా కాపాడాలి

మంత్రి సవిత ఆదేశం



**అమరావతి సింధూరదర్శిని:**

ప్రస్తుతం కురుస్తున్న భారీ వర్షాలతో బీసీ సంక్షేమ శాఖాధికారులు అప్రమత్తంగా ఉండాలని, బీసీ హాస్టళ్లు, గురుకులాల్లో చదువుకునే విద్యార్థులను కంటికి రెప్పలా చూసుకోవాలని రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత మరియు జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత ఆదేశించారు. వ్యాధులు ప్రబలకుండా హాస్టళ్లు, గురుకులాల పరిసరాల్లో వర్షపు నీరు నిల్వ లేకుండా చూసుకోవాలని, విద్యార్థులు అస్వస్థతకు గురైతే తక్షణమే మెరుగైన విద్యమందించాలని స్పష్టంచేశారు. తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో బీసీ సంక్షేమ శాఖ కార్యదర్శి ఎస్.సత్యనారాయణ, పలువురు కార్పొరేషన్ల చైర్మన్లతో మంత్రి సవిత

మిగతా 2లో...

# ప్రవాహాలతో రిజర్వాయర్లు, చెరువులు నింపాలి

ప్రవాహాలతో రిజర్వాయర్లు, చెరువులు నింపాలి - చెరువులు నింపేందుకు మొబైల్ లిఫ్టులు

పడుతున్న వర్షాలతో భూగర్భజలాల రీఛార్జ్

రాష్ట్రంలో వర్షాలు, నీటి ప్రవాహాలపై ఆర్టీజీఎస్ సమీక్షలో సీఎం చంద్రబాబు




**అమరావతి సింధూరదర్శిని:**
వర్షాల కారణంగా వస్తున్న ప్రవాహాలతో రాష్ట్రంలోని అన్ని నీటి వనరుల్ని నింపాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. కృష్ణా, గోదావరి డెల్టాలోని రిజర్వాయర్లతో పాటు పరిధిలో ఉన్న వివిధ నీటి వనరుల్ని కూడా నింపాలని స్పష్టం చేశారు. రియల్‌టైమ్ గవర్నెన్స్ కేంద్రంలో వివిధ శాఖల ఉన్నతాధికారులతో నిర్వహించిన సమీక్షలో ఏఐ ఆధారిత సాంకేతికత వినియోగం, డేటా అనలిటిక్స్, ఎల్‌నినో ప్రభావాన్ని ఎదుర్కొనే వ్యూహాలతో పాటు రాష్ట్రవ్యాప్తంగా వర్ష ప్రభావంపై సీఎం చర్చించారు. తీవ్ర వాయుగుండం కారణంగా రాష్ట్రంలో గడచిన మూడు రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా భూగర్భజలాలు కొంత మేర పెరిగాయని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. ప్రకాశం బ్యారేజి సహా మున్నేరు సహా ఇతర క్యాచ్ మెంట్ ఏరియా నుంచి 11 వేల క్యూసెక్కుల నీరు

మిగతా 2లో...



# కాకినాడ జిల్లాలో కుండపోత వర్షాలు..

అధికారులకు పవన్ కల్యాణ్ కీలక ఆదేశాలు

కాకినాడ జిల్లాలో భారీ వర్షాలపై కలెక్టర్‌తో ఫోన్‌లో సమీక్షించిన పవన్ కల్యాణ్

జిల్లాలో 1,885 హెక్టార్లలో పంట నష్టం జరిగినట్లు ప్రాథమిక అంచనా

నష్టపోయిన వారికి తక్షణం పరిహారం అందించేలా చర్యలు తీసుకోవాలని సూచన

**అమరావతి సింధూరదర్శిని:**

తీవ్ర వాయుగుండం ప్రభావంతో కాకినాడ జిల్లావ్యాప్తంగా కురుస్తున్న అత్యంత భారీ వర్షాల నేపథ్యంలో, అధికార యంత్రాంగం మరో రెండు రోజుల పాటు అత్యంత అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర

మిగతా 2లో...

# ఫార్మా నుంచి ఫిన్‌టెక్ వరకు.. ఢిల్లీలో నారా లోకేశ్ పెట్టుబడుల వేట



ఏపీలో పెట్టుబడుల కోసం ఢిల్లీలో మంత్రి లోకేశ్ వరుస సమావేశాలు

కాకినాడలో గ్రీన్ అమ్మోనియా కేంద్రం ఏర్పాటుకు యారాకు ఆహ్వానం

విశాఖలో టెక్నాలజీ, ఇంజనీరింగ్ సెంటర్ల ఏర్పాటుకు సిస్కో, శాప్‌లకు విజ్ఞప్తి

తిరుపతిలో ఎలక్ట్రానిక్ కాంపోనెంట్స్ తయారీ పార్క్ ఏర్పాటు చేయాలని వివోకు సూచన

**న్యూఢిల్లీ:** ఆంధ్రప్రదేశ్‌ను పారిశ్రామికంగా, ఆర్థికంగా బలోపేతం చేసే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం దూకుడు పెంచింది. రాష్ట్రానికి భారీ పెట్టుబడులను ఆకర్షించేందుకు రాష్ట్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్, విద్యాశాఖల మంత్రి నారా లోకేశ్ ఢిల్లీలో పర్యటిస్తున్నారు. ఈపర్యటనలో భాగంగా ఆయన వ్యవసాయం, ఆగ్రో కెమికల్స్, ఐటీ, ఫార్మా, ఎలక్ట్రానిక్స్, మౌలిక సదుపాయాల రంగాలకు చెందిన పలు దిగ్గజ సంస్థల ప్రతినిధులతో వరుస సమావేశాలు నిర్వహిస్తున్నారు. రాష్ట్రంలో పెట్టుబడులకు ఉన్న అవకాశాలను వివరిస్తూ, ఏపీలో తమ కార్యకలాపాలను విస్తరించాల్సిందిగా వారిని ఆహ్వానిస్తున్నారు.

**కాకినాడలో గ్రీన్ అమ్మోనియా కేంద్రం: యారాకు లోకేశ్ ఆహ్వానం**

పర్యటనలో భాగంగా, నార్వేకు చెందిన ప్రముఖ ఎరువులు, అమ్మోనియా తయారీ సంస్థ యారా ఇంటర్నేషనల్ పబ్లిక్ ఎఫైర్స్ హెడ్ వైశాలి చోప్రాతో మంత్రి లోకేశ్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కాకినాడలో గ్రీన్-అమ్మోనియా తయారీ, ఎగుమతి కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని లోకేశ్ ఆహ్వానించారు. ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ మార్కెట్ అవసరాలను తీర్చడానికి ప్రత్యేక ఎరువుల మిశ్రమం, సూక్ష్మపోషకాల ప్లాంట్‌ను ఏర్పాటుచేసే అవకాశాలను పరిశీలించాలని సూచించారు. అంతేకాకుండా, ఆచార్య ఎన్.జి. రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం సహకారంతో పంట-పోషణ సాంకేతికత, డిజిటల్ వ్యవసాయ కేంద్రాన్ని నెలకొల్పాలని కోరారు. దీనిపై వైశాలి చోప్రా స్పందిస్తూ, యారా ఇండియా ఇప్పటికే 17 రాష్ట్రాల్లో 1500 అవుట్‌లెట్ల ద్వారా 5.5 మిలియన్ల రైతులకు డిజిటల్‌గా సేవలు అందిస్తోందని తెలిపారు. యూపీలోని బాబ్రాలా

మిగతా 2లో...



**అధికారానంది వాహనంపై ఊరేగిన విఘ్న వినాయకుడు**

వివరాలు 5 లో

## కాకినాడ జిల్లాలో కుండపోత వర్షాలు

(మొదటిపేజీ తరువాయి)

ఉప ముఖ్యమంత్రి, పంచాయతీరాజ్ శాఖ మంత్రి పవన్ కల్యాణ్ ఆదేశించారు. వర్షాలు పూర్తిగా తగ్గుముఖం పట్టేవరకు క్షేత్రస్థాయిలో నిరంతర పర్యవేక్షణ కొనసాగించాలని స్పష్టం చేశారు. భారీ వర్షాల కారణంగా జిల్లాలో నెలకొన్న పరిస్థితులపై ఆయన జిల్లా కలెక్టర్ హరేందర్ ప్రసాద్‌తో ఫోన్‌లో మాట్లాడి సమీక్ష నిర్వహించారు. గత రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలు, లోతట్టు ప్రాంతాల పరిస్థితి, జలాశయాల్లో నీటి మట్టాలు, విద్యుత్, తాగునీటి సరఫరా, పంట నష్టం, మత్స్యకారుల భద్రత వంటి పలు కీలక అంశాలపై పవన్ కల్యాణ్ వివరాలు అడిగి తెలుసుకున్నారు. గడిచిన రెండు రోజుల్లో జిల్లావ్యాప్తంగా సగటున 117.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైందని, 15 ప్రాంతాల్లో రహదారులపై చెట్లు కూలగా వాటిని తక్షణం తొలగించామని కలెక్టర్ వివరించారు. ప్రాథమిక అంచనాల ప్రకారం జిల్లాలో సుమారు 1,885 హెక్టార్లలో పంట నష్టం వాటిల్లిందని పవన్ కల్యాణ్ దృష్టికి తీసుకెళ్లారు. ప్రత్యేక కంట్రోల్ రూమ్ ద్వారా పరిస్థితిని 24 గంటలూ సమీక్షిస్తున్నామని, ప్రస్తుతం అంతా అదుపులోనే ఉందని తెలిపారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ మాట్లాడుతూ, వరద ముప్పు, సహాయక చర్యలపై అధికారులకు పలు కీలక సూచనలు, ఆదేశాలు జారీ చేశారు. "జిల్లాలో ఇంకా భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని, ఆకస్మిక వరదల ముప్పు పొంచి ఉందని హెచ్చరికలు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో లోతట్టు ప్రాంతాలు, ముంపునకు గురయ్యే గ్రామాలు, కాలనీలపై నిరంతరం దృష్టి సారించాలి. అవసరమైన చోట తక్షణమే పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేసి, ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలి" అని స్పష్టం చేశారు. పారిశుద్ధ్య నిర్వహణకు ఆటంకం కలగకుండా, లోతట్టు ప్రాంతాల్లో నీరు నిలిచిపోకుండా పంపుల సహాయంతో ఎప్పటికప్పుడు డీ-వాటరింగ్ చేయాలని ఆదేశించారు. ఈదురు గాలులకు కూలిన చెట్లను వెంటనే తొలగించి, రవాణా వ్యవస్థను పునరుద్ధరించాలన్నారు. విద్యుత్, తాగునీటి సరఫరాలో అంతరాయాలు ఏర్పడితే ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను తక్షణం పరిష్కరించాలని సూచించారు. ఏలేరు, తాండవ, పంపా, సుబ్బారెడ్డి సాగర్ జలాశయాల్లో నీటి మట్టాలను నిరంతరం గమనిస్తూ, అవసరమైతే దిగువ ప్రాంతాల ప్రజలను ముందస్తుగా హెచ్చరించాలని చెప్పారు.

వర్షాలు తగ్గిన వెంటనే క్షేత్రస్థాయిలో పర్యటించి పంట నష్టాన్ని కచ్చితంగా అంచనా వేయాలని, ఆ నివేదికను ప్రభుత్వానికి పంపి రైతులకు వెంటనే పరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని పవన్ కల్యాణ్ ఆదేశించారు. ఆస్తి నష్టం జరిగిన బాధితులకు కూడా తక్షణ సహాయం అందించే ఏర్పాట్లు చేయాలన్నారు. తన నియోజకవర్గమైన పిఠాపురం పరిధిలోని సుద్దగడ్డ వాగు ముంపు ప్రాంతాల పరిస్థితిపై ఎప్పటికప్పుడు తనకు నివేదించాలని కోరారు. సముద్రం అల్లకల్లోలంగా ఉన్నందున, ఉప్పాడ తీర ప్రాంతంలో పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. వాయుగుండం ప్రభావం పూర్తిగా తొలగిపోయే వరకు మత్స్యకారులెవరూ సముద్రంలోకి వేటకు వెళ్లకుండా కఠినమైన హెచ్చరికలు అమలు చేయాలన్నారు. జిల్లాలో పరిస్థితి తిరిగి సాధారణ స్థితికి వచ్చేంత వరకు యంత్రాంగం ప్రతి క్షణం అప్రమత్తంగా ఉండి ప్రజలకు అండగా నిలవాలని పవన్ కల్యాణ్ దిశానిర్దేశం చేశారు.

## ఎన్నికల సంఘం యాప్‌పై మరోసారి వివాదం

(మొదటిపేజీ తరువాయి)

శస్త్రచికిత్స, అవయవ మార్పిడి, కీమోథెరపీ వంటి కీలక చికిత్సలకు కూడా అవకాశం దక్కదు. ఈ పథకం రాష్ట్ర ఓటర్లకే పరిమితం కావడంతో నిరుపేదలు తీవ్ర ఇబ్బందుల్లో పడుతున్నారని థరూర్ ఆందోళన వ్యక్తం చేశారు. తన సోషల్ మీడియా పోస్టులో ఆయన "ఇది కేవలం రాజకీయ సమస్య కాదు. పౌరుల ప్రాథమిక హక్కులు, ప్రాణాలు ప్రమాదంలో పడుతున్నాయి. ఇలాంటి అమానుష వ్యవస్థను కొనసాగించకూడదు. ఎన్నికల సంఘం వెంటనే క్షమాపణ చెప్పి, ఈ సాఫ్ట్‌వేర్‌ను రద్దు చేయాలి. జరిగిన నష్టాన్ని సరిదిద్దాలి" అని స్పష్టం చేశారు.

## యుద్ధాన్ని హిందూ మహాసముద్రానికి విస్తరిస్తామన్న ఇరాన్.. భారత్‌పై ప్రభావం ఎంత?

(మొదటిపేజీ తరువాయి)

ప్రస్తావించడం ఇదే తొలిసారి.

ప్రస్తుతం పర్షియన్ గల్ఫ్, హర్మూజ్ జలసంధిపై ఇరాన్ ఆంక్షలు విధించగా, యెమెన్‌లోని హౌతీ తిరుగుబాటుదారులు ఎర్ర సముద్ర తీరం, కీలకమైన బాబ్ అల్-మందబ్ జలసంధిపై పట్టు బిగించారు. ప్రపంచ చమురు, గ్యాస్ రవాణాకు కీలకమైన హర్మూజ్ జలసంధిపై పట్టు కోసం ఇరాన్, అమెరికా పోటీ పడుతున్నాయి. ఈ నేపథ్యంలో ఇరాన్ తాజా హెచ్చరికలకు ప్రాధాన్యం ఏర్పడింది. ఈ సంక్షోభం హిందూ మహాసముద్రానికి విస్తరిస్తే, మధ్యప్రాచ్యం, ఐరోపా, ఆఫ్రికాలతో భారత్‌ను కలిపే వాణిజ్య మార్గాలకు తీవ్ర అంతరాయం కలుగుతుంది. భారత్ తన ముడి చమురు అవసరాల్లో అధిక భాగాన్ని మధ్యప్రాచ్యం నుంచే దిగుమతి చేసుకుంటోంది.

హర్మూజ్ లేదా సమీప జలాల్లో రవాణాకు ముప్పు ఏర్పడితే చమురు ధరలు, రవాణా ఖర్చులు, సముద్ర బీమా ప్రీమియంలు పెరిగే ప్రమాదం ఉంది. ఇప్పటికే ఎర్ర సముద్రంలోని ఉద్రిక్తతల కారణంగా కొన్ని నౌకలు కేప్ ఆఫ్ గుడ్ హోప్ చుట్టూ ప్రయాణిస్తున్నాయి. ఇప్పుడు యుద్ధం తూర్పు వైపు విస్తరిస్తే భారతీయ నౌకలు, దిగుమతిదారులపై ఒత్తిడి మరింత పెరుగుతుంది. అంతేకాకుండా, హిందూ మహాసముద్రంలో భద్రతా బాధ్యతలు భారత నౌకాదళంపై అధికమవుతాయి. అయితే, ఇరాన్ వాణిజ్య నౌకలను లక్ష్యంగా చేసుకుంటుందా లేదా సైనిక స్థావరాలపై దాడి చేస్తుందా అనే దానిపై సఫావి స్పష్టత ఇవ్వలేదు. కానీ, ఈ హెచ్చరికలు అంతర్జాతీయ వాణిజ్య మార్గాలకు పెరుగుతున్న ముప్పును స్పష్టంగా సూచిస్తున్నాయి.

## ఫార్మా నుంచి ఫిన్‌టెక్ వరకు.. ఢిల్లీలో నారా లోకేశ్ పెట్టుబడుల వేట

(మొదటిపేజీ తరువాయి)

కాంప్లెక్స్ ద్వారా ఏటా 1.6 మిలియన్ టన్నుల యూరియా, 0.66 మిలియన్ టన్నుల అమ్మోనియా ఉత్పత్తి చేస్తున్నామని వివరించారు. ఏపీ ప్రభుత్వ ప్రతిపాదనలపై తమ సంస్థ ఉన్నతస్థాయి బృందంతో చర్చిస్తామని హామీ ఇచ్చారు.

### గోద్రెజ్ ఆగ్రో కెమికల్ యూనిట్‌కు ఏపీ అనువైనది

ప్రముఖ పారిశ్రామిక సంస్థ గోద్రెజ్ గ్రూప్ ప్రెసిడెంట్ రాకేశ్ స్వామితోనూ మంత్రి లోకేశ్ భేటీ అయ్యారు. గోద్రెజ్ అనుబంధ సంస్థ అజ్‌టెక్ లైఫ్‌సైన్సెస్ ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్‌లో ఒక ఆగ్రో కెమికల్ యూనిట్‌ను ఏర్పాటు చేయాలని ఈ సందర్భంగా లోకేశ్ కోరారు. రెడీ టు ఈట్ పాల ఉత్పత్తుల ప్రాసెసింగ్ ప్లాంట్లు, ఆయిల్ పామ్ ప్రాసెసింగ్, సమాధాన్ కేంద్రాలను విస్తరించాలని సూచించారు.

దీనికి రాకేశ్ స్వామి స్పందిస్తూ, గోద్రెజ్ ఆగ్రోవెట్ ఇప్పటికే భారతదేశంలో అతిపెద్ద ఆయిల్ పామ్ ప్రాసెసర్‌గా ఉందని గుర్తుచేశారు. గత ఏడాది నవంబర్‌లో ఏపీలో ఆయిల్ పామ్ ప్రాసెసింగ్, సమాధాన్ కేంద్రాల ఏర్పాటు కోసం రూ.70 కోట్లతో అవగాహన ఒప్పందం చేసుకున్నామని తెలిపారు. ద్వారకా తిరుమల మండలంలో రూ.210 కోట్ల పెట్టుబడితో మిఠాయి, కోకో బటర్ తయారీ యూనిట్‌ను కూడా ఏర్పాటు చేస్తున్నామని వివరించారు. ఏపీ ప్రభుత్వ తాజా ప్రతిపాదనలను కూడా పరిశీలిస్తామని స్వామి హామీ ఇచ్చారు.

### ఏపీలో డిజిటల్ గవర్నెన్స్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్: శాప్‌తో భేటీ

జర్మనీకి చెందిన ప్రముఖ ఎంటర్‌ప్రైజ్ సాఫ్ట్‌వేర్ సంస్థ శాప్ (ఞూఞా) సీనియర్ వైస్ ప్రెసిడెంట్ లవ్‌నీష్ చనానాతో మంత్రి లోకేశ్ సమావేశమయ్యారు. ఆంధ్రప్రదేశ్‌లో స్మార్ట్ గవర్నెన్స్, చిన్న, మధ్య తరహా పరిశ్రమల డిజిటలైజేషన్, నైపుణ్యాభివృద్ధి లక్ష్యంగా ఒక 'డిజిటల్ గవర్నెన్స్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్'ను ఏర్పాటు చేయాలని కోరారు. విద్యార్థులకు ఞూఞా నైపుణ్యాలు, సర్టిఫికేషన్ అందించేందుకు ఆంధ్రప్రదేశ్ టెక్నాలజీ సర్వీసెస్‌తో కలిసి పనిచేయాలని సూచించారు. దీనిపై చనానా స్పందిస్తూ, భారత్‌లో శాప్ ల్యాబ్స్ తమకు రెండవ అతిపెద్ద ఆర్‌డడీ హబ్ అని, బెంగళూరులో 15 వేల సీట్లతో కొత్త క్యాంపస్ ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ప్రభుత్వ రంగ సంస్థలు, బ్యాంకులకు సాంకేతిక సేవలు అందిస్తున్నామని, ఏపీ ప్రభుత్వ ప్రతిపాదనలను పరిశీలిస్తామని చెప్పారు.

### స్టార్టప్‌ల ప్రోత్సాహానికి భాగస్వాములు కండి: మాస్టర్‌కార్డ్‌కు లోకేశ్ విజ్ఞప్తి

గ్లోబల్ పేమెంట్స్ టెక్నాలజీ దిగ్గజం మాస్టర్‌కార్డ్ వైస్ ప్రెసిడెంట్ అభిషేక్ లాహిరితో మంత్రి లోకేశ్ భేటీ అయ్యారు. విశాఖపట్నంలో గ్లోబల్ కేపబిలిటీ సెంటర్ (జీసీసీ) లేదా టెక్నాలజీ సెంటర్ ఏర్పాటు చేయాలని కోరారు. స్టార్టప్‌లను ప్రోత్సహించేందుకు రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ (ఞ×ఎ)లో ఫిన్‌టెక్ సలహాదారుగా చేరాలని ఆహ్వానించారు. ఇప్పటికే రాజమండ్రి, కోనసీమలో మాస్టర్‌కార్డ్ అమలు చేస్తున్న 'ప్రైస్‌లెస్ ఎక్స్‌పీరియన్స్' కార్యక్రమాన్ని ఇతర పర్యాటక ప్రాంతాలకు విస్తరించాలని సూచించారు. దీనికి అభిషేక్ లాహిరి స్పందిస్తూ, భారత్‌లో పూణేలో తమకు అతిపెద్ద టెక్ హబ్ ఉందని, ఏపీ టూరిజం అథారిటీతో ఇప్పటికే ఎంఓయూ ఉందని గుర్తుచేశారు. తాజా ప్రతిపాదనలను ఉన్నతస్థాయి బృందంతో చర్చిస్తామని తెలిపారు.

### వైద్య పరికరాల తయారీ యూనిట్ ఏర్పాటు చేయండి: అబాట్‌కు ఆహ్వానం

అమెరికాకు చెందిన ప్రముఖ మెడికల్ డివైసెస్, ఫార్మా సంస్థ అబాట్ ఇండియా ఎండీ ఇస్తేయాక్ అంజాద్‌తో మంత్రి లోకేశ్ సమావేశమయ్యారు. ఏపీలోని మెడ్‌టెక్ జోన్ (ఞామ్జీ) లేదా ఎలక్ట్రానిక్స్ మ్యానుఫ్యాక్చరింగ్ క్లస్టర్ (జువీజ)లో వైద్య పరికరాలు లేదా డయాగ్నోస్టిక్స్ తయారీ యూనిట్‌ను ఏర్పాటు చేయాలని లోకేశ్ ఆహ్వానించారు. నక్కపల్లిలో రాబోయే బల్క్ డ్రగ్ పార్క్‌లో జెనరిక్ మందుల తయారీ కేంద్రాన్ని, విశాఖలో గ్లోబల్ కేపబిలిటీ సెంటర్ ఏర్పాటు అవకాశాలను పరిశీలించాలని కోరారు. దీనిపై అంజాద్ స్పందిస్తూ, భారత్‌లో తమకు గోవా, గుజరాత్‌లలో తయారీ కేంద్రాలున్నాయని, స్థానిక ఫార్మా సంస్థల్లో పెట్టుబడులకు ఆసక్తిగా ఉన్నామని చెప్పారు. ఏపీ ప్రభుత్వ ప్రతిపాదనలను పరిశీలిస్తామని హామీ ఇచ్చారు.

### ఏపీలో ఇంజనీరింగ్ సెంటర్/జీసీసీ ఏర్పాటు చేయండి: సిస్కోతో లోకేశ్ భేటీ

గ్లోబల్ నెట్‌వర్కింగ్ దిగ్గజం సిస్కో సిస్టమ్స్ మేనేజింగ్ డైరెక్టర్ హరీష్ కృష్ణన్‌తో మంత్రి లోకేశ్ సమావేశమయ్యారు. ఏపీలో వేగంగా అభివృద్ధి చెందుతున్న డేటా సెంటర్ల డిమాండ్‌కు అనుగుణంగా సర్వర్లు, స్విచ్‌లు, రౌటర్ల తయారీ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. విశాఖపట్నంలో ఒక ఇంజనీరింగ్ సెంటర్ లేదా జీసీసీని ఏర్పాటు చేయాలని కోరారు. హరీశ్ కృష్ణన్ స్పందిస్తూ, ఏపీ ప్రభుత్వంతో తమకు ఇప్పటికే బలమైన అనుబంధం ఉందని గుర్తుచేశారు. 50 వేల మంది యువతకు నైపుణ్య శిక్షణ, విశాఖలో ఇన్నోవేషన్ సెంటర్, తిరుపతిలో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ (సీఓఈ), ఏపీ ఫైబర్‌నెట్ ప్రాజెక్టుల్లో భాగస్వామ్యం వహించామని తెలిపారు. చెన్నైలోని తయారీ ప్లాంట్ ద్వారా 1 బిలియన్ డాలర్ల ఎగుమతులను లక్ష్యంగా పెట్టుకున్నామని, ఏపీ ప్రభుత్వ తాజా ప్రతిపాదనలను కూడా పరిశీలిస్తామని చెప్పారు.

### వివో కాంపోనెంట్స్ తయారీ పార్క్ ఏర్పాటు చేయండి

చైనాకు చెందిన ప్రముఖ స్మార్ట్‌ఫోన్ల తయారీ సంస్థ వివో ఇండియా ప్రెసిడెంట్ అర్జిత్ సేన్‌తోనూ లోకేశ్ సమావేశమయ్యారు. ఎలక్ట్రానిక్స్ హబ్‌గా ఎదుగుతున్న తిరుపతిలో వివో మొబైల్స్ కాంపోనెంట్స్ తయారీ కేంద్రాన్ని ఏర్పాటుచేయాలని కోరారు. వివో సరఫరా దారుల కోసం ప్రత్యేకంగా ఒక 'కాంపోనెంట్స్ తయారీ పార్క్' అభివృద్ధి చేయాలని, దీనికోసం ప్రభుత్వంతో కలిసి 'సప్లై చైన్ సమావేశం' నిర్వహించాలని సూచించారు. అర్జిత్ సేన్ స్పందిస్తూ, దేశంలో విక్రయించే ఫోన్లలో 99% పైగా గ్రేటర్ నోయిడాలోనే తయారు చేస్తున్నామని తెలిపారు. ఏపీ ప్రభుత్వ ప్రతిపాదనలపై తమ ఉన్నతస్థాయి బృందంతో చర్చిస్తామని హామీ ఇచ్చారు. మొత్తం మీద, మంత్రి నారా లోకేశ్ ఢిల్లీ పర్యటన ఆంధ్రప్రదేశ్‌లో పెట్టుబడులను ఆకర్షించడం, పారిశ్రామిక ప్రగతికి బాటలు వేయడమే లక్ష్యంగా సాగింది. పలు దిగ్గజ సంస్థల నుంచి సానుకూల స్పందన రావడంతో, భవిష్యత్తులో ఈ ప్రతిపాదనలు కార్యరూపం దాల్చుతాయని ప్రభుత్వం ఆశాభావం వ్యక్తం చేస్తోంది.

## ప్రవాహాలతో రిజర్వాయర్లు, చెరువులు నింపాలి

(మొదటిపేజీ తరువాయి)

వస్తోందని అన్నారు. ప్రాజెక్టుల దిగువన ఉన్న అన్ని నీటి వనరుల్లో వర్షపు నీటిని నిల్వ చేయాలని ముఖ్యమంత్రి దిశానిర్దేశం చేశారు. అవసరమైన చోట మోటార్లను వాడి నీటిని లిఫ్ట్ చేయాలని స్పష్టం చేశారు. గోదావరి నుంచి వస్తున్న ప్రవాహాల ద్వారా 24 టీఎంసీల నీటిని ఏలేరు రిజర్వాయర్ నింపాలని స్పష్టం చేశారు. పోలవరం ఎడమ కాలువ ద్వారా అనకాపల్లి వరకూ నీటి వనరుల్లోకి నీటిని పంపాలన్నారు. రాష్ట్రంలోని 16 జిల్లాల్లో వర్షాలు అధికంగా నమోదు అయ్యాయని అధికారులు వివరించారు. ముఖ్యంగా విశాఖపట్నం, అనకాపల్లి, విజయనగరం, శ్రీకాకుళం, మన్యం, కాకినాడ, ఉభయగోదావరి, ఏలూరు, కృష్ణా, ఎన్టీఆర్ సహా వివిధ జిల్లాల్లో తీవ్ర వర్ష ప్రభావం కనిపించిందని తెలిపారు.

### గోదావరి, కృష్ణా, నాగావళి, వంశధార బేసిన్లపై ప్రత్యేక దృష్టి

ప్రస్తుతం కొనసాగుతున్న వర్షాలు, గాలుల తీవ్రత, నదులు-వాగుల్లో పెరుగుతున్న ప్రవాహాలు, రిజర్వాయర్లలోకి చేరుతున్న వరద నీరు, రాబోయే రోజుల్లో అంచనా వేసిన వర్షపాతంపై ముఖ్యమంత్రి సమీక్షించారు. తాజా పరిస్థితులను నిరంతరం పర్యవేక్షిస్తూ అవసరమైన ముందస్తు చర్యలు చేపట్టేలా అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వర్షాల ప్రభావంతో గోదావరి బేసిన్‌లోని శబరి, ఇంద్రావతి, ఏలేరు, తాండవ, ఎర్రకాల్వ, పంపా, మేఘాద్రిగడ్డ తదితర రిజర్వాయర్లకు భారీగా వరద నీరు చేరుతుందని ప్రభుత్వం అంచనా వేస్తోంది. ఏలేరు రిజర్వాయర్‌కు 21,200-26,500 క్యూసెక్కుల మేర, తాండవకు 6,000-7,500 క్యూసెక్కులు, మేఘాద్రి గడ్డకు 2,400-3,000 క్యూసెక్కులు, పంపాకు 3,100-3,875 క్యూసెక్కులు వరకు ఇన్‌ఫ్లో వస్తుందని అంచనా వేస్తున్నారు. ఉత్తర కోస్తా రిజర్వాయర్లకు కూడా రాబోయే రోజుల్లో ఇన్‌ఫ్లో గణనీయంగా పెరుగుతుందని వెల్లడించారు. నాగావళి--వంశధార బేసిన్లలో వర్షాల ప్రభావంతో ప్రవాహాలు పెరగనున్నాయని వివరిచారు. గొట్టా బ్యారేజీకి సెప్టెంబర్ 25 ఉదయం నాటికి వార్నింగ్ లెవల్--1 చేరుకునే అవకాశం ఉందని అంచనా వేశారు. భద్రాచలం వద్ద సెప్టెంబర్ 26 మధ్యాహ్నానికి వార్నింగ్ లెవల్--1, అదే రోజు రాత్రికి వార్నింగ్ లెవల్--2 దాటే అవకాశం ఉందని తెలిపారు. ధవళేశ్వరం బ్యారేజీ వద్ద సెప్టెంబర్ 27 ఉదయం వార్నింగ్ లెవల్--1, సాయంత్రం వార్నింగ్ లెవల్--2 దాటే అవకాశం ఉందని అంచనా వేశారు. శబరి నదిపై కుంటా వద్ద సెప్టెంబర్ 26 ఉదయానికి వార్నింగ్ స్థాయికి చేరుకునే అవకాశం ఉందని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు.

### ప్రకృతి వ్యవసాయం చేయాలి... భూసారాన్ని పెంచాలి

ఎల్‌నినో వంటి వాతావరణ పరిస్థితులను మార్చడం సాధ్యం కాకపోయినా.. వాటి ప్రభావాన్ని తగ్గించేలా అంతర్గత పరిస్థితులను మార్చుకోవచ్చని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. భూసారాన్ని పెంచడం, సాయిల్ టెస్టింగ్ ఆధారంగా ప్రత్యామ్నాయ పంటలను సూచించడం, బయోచార్, ప్రకృతి వ్యవసాయం వంటి విధానాల ద్వారా ఎల్‌నినో ప్రభావాన్ని కొంతమేర తగ్గించవచ్చని తెలిపారు. ఈ విధానాన్ని రాష్ట్రంలో పైలట్‌గా అమలు చేయాలని అధికారులను ఆదేశించారు. ఎల్‌నినో ప్రభావాన్ని ముందుగానే అంచనా వేసి వ్యవసాయ రంగానికి అవసరమైన సూచనలు అందించేలా సాంకేతికతను వినియోగించుకోవాలని సీఎం సూచించారు. వ్యవసాయానికి సంబంధించిన సమాచారంతో పాటు సాగునీటి లభ్యత, రిజర్వాయర్ల పరిస్థితి తదితర వివరాల డేటా పొందుపరచాలని ఆదేశించారు. అక్టోబరు 2 తేదీన ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్ కు శంకుస్థాపన చేయనున్నామని, అదే రోజు రాయలసీమను హార్టికల్చర్ హబ్ గా అభివృద్ధి చేసే కార్యక్రమాన్ని కూడా ప్రారంభిస్తామన్నారు. మైక్రోసాఫ్ట్ సహకారంతో రూపొందించిన ఏఐ స్టాక్ ద్వారా కలిగే లాభాలను వివరిస్తూ డెమో ఇవ్వాలని సీఎం సూచించారు. భూగర్భజలాలు సహా స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా చేపడుతున్న కార్యక్రమాలపైనా అమెరికాలోని పృథ్వీ అనే యువకుడు రూపొందించిన యాప్ లను సీఎం పరిశీలించారు. వివిధ శాఖల నుంచి సేకరించిన డేటా సెట్లను సమన్వయం చేసుకుంటూ నాసా ఉపగ్రహ చిత్రాలను అనుసంధానం చేస్తూ ఈ యాప్ ను రూపొందించిన పృథ్విని సీఎం అభినందించారు. భూగర్భజలాల స్థాయిలు, వాటి మార్పులు, ప్రాంతాల వారీ పరిస్థితులను విశ్లేషించడం ద్వారా భవిష్యత్తులో నీటి నిర్వహణకు మెరుగైన నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉంటుందని సీఎం స్పష్టం చేశారు.

### శాప్ ద్వారా క్రీడా క్యాలండర్

పాఠశాలల్లో మౌలిక సదుపాయాలను మరింతగా మెరుగుపరచాలని సీఎం ఆదేశించారు. విద్యుత్ టారిఫ్‌ను పెంచకపోయినా సేవల్లో లోపాల కారణంగా ప్రజల్లో సంతృప్తి తగ్గుతోందని, సరఫరా నాణ్యతపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. రాష్ట్రంలో 287.214 మిలియన్ యూనిట్ల విద్యుత్ వినియోగం ఉన్న నేపథ్యంలో.. విద్యుత్ ఉత్పత్తికి అవసరమైన నీటి లభ్యతపైనా దృష్టి పెట్టాలని అధికారులకు సూచించారు. రాష్ట్రంలో ఇసుక లభ్యత ధరలు, సరఫరాపై నిరంతర పర్యవేక్షణ ఉండాలని ఆదేశించారు. శాప్ ఆధ్వర్యంలో ఏడాది క్రీడా క్యాలెండర్‌ను రూపొందించాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. పట్టణాలకే పరిమితం కాకుండా గ్రామస్థాయిలోనూ క్రీడా పోటీలు నిర్వహించాలని సూచించారు. 175 నియోజకవర్గాల్లో క్షేత్రస్థాయిలో సిబ్బంది పనితీరును మెరుగుపరిచేలా స్పష్టమైన సూచనలు ఇవ్వాలని సీఎం ఆదేశించారు. నోడల్ అధికారుల ఆధ్వర్యంలో నియోజకవర్గాల వారీగా సమావేశాలు నిర్వహించి పనితీరులో మార్పు తీసుకురావాలని ఆదేశించారు. గృహనిర్మాణంలో జీరామ్‌జీ ద్వారా మౌలిక సదుపాయాల కల్పన పనులు చేపట్టాలని సీఎం సూచించారు. డేటా ఆధారిత పాలనలో భాగంగా ప్రభుత్వ శాఖల్లో ఏఐ లివింగ్ ల్యాబ్స్ యాప్‌ల వినియోగం, సమాచార విశ్లేషణను మరింత విస్తరించాలని సీఎం స్పష్టం చేశారు.

## బీసీ బిడ్డలను కంటికి రెప్పలా కాపాడాలి



(మొదటిపేజీ తరువాయి)

గురువారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బీసీ సంక్షేమ శాఖ కార్యదర్శి ఎస్.సత్యనారాయణకు మంత్రి సవిత కీలక ఆదేశాలు జారీచేశారు. రాష్ట్రవ్యాప్తంగా కురుస్తున్న భారీ వర్షాలతో బీసీ సంక్షేమ శాఖాధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. బీసీ హాస్టళ్లు, గురుకులాల సిబ్బంది నిత్యం అందుబాటులో ఉంటూ, విద్యార్థుల యోగా క్షేమాలను గమనిస్తూ ఉండాలన్నారు. వేడి, తాజా ఆహారం మాత్రమే అందించాలని స్పష్టంచేశారు. బయట ఆహారాన్ని లోపలికి రానివ్వొద్దని, కాచి చల్లార్చిన నీటి మాత్రమే అందివ్వాలని తెలిపారు. హాస్టళ్లు, గురుకులాల చుట్టు పక్కల నీరు నిల్వ లేకుండా చూసుకోవాలని, వ్యాధులు ప్రబలక ముందే ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహించాలని ఆదేశించారు. విద్యార్థులు అస్వస్థతకు గురి కాగానే సమీప ఆసుపత్రులకు తరలించాలన్నారు. పాత భవనాల్లో ఉన్న విద్యార్థులను సురక్షిత భవనాల్లోకి తరలించాలని మంత్రి సవిత ఆదేశించారు.

### ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లండి

రానున్న స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో ఇప్పటి నుంచే సమాయత్తం కావాలని బీసీ కార్పొరేషన్ చైర్మన్లకు మంత్రి సవిత దిశా నిర్దేశం చేశారు. కూటమిలోని పార్టీలు, నాయకులతో సమన్వయం చేసుకోవాలన్నారు. ముఖ్యం గా కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని స్పష్టంచేశారు. రెండేళ్ల సీఎం చంద్రబాబునాయుడు పాలనలో బీసీల అభివృద్ధి కోసం అమలు చేసిన పథకాలను, అభివృద్ధి కార్యక్రమాలను వివరించాలని మంత్రి సవిత ఆదేశించారు. ఈ సమీక్షా సమావేశంలో బీసీ కార్పొరేషన్ చైర్మన్లు వీరంకి వెంకట గురుమూర్తి, పేరేపి ఈశ్వర్, మల్లెల ఈశ్వర్, వెంకటరమణ,యాటగిరి రాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



# ప్రజా సమస్యలను తక్షణమే పరిష్కరించాలి

## ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్

గూడూరు( సింధూర దర్శిని) 24 సెప్టెంబర్ నెల్లూరు జిల్లా ; గూడూరు పురపాలక సంఘ కార్యాలయంలో మంచినీటి సరఫరా, వీధిలైట్లు , శానిటేషన్ పై పలు శాఖల అధికారులతో ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ సమీక్ష సమావేశం నిర్వహించారు. శాఖల వారీగా వివరాలను అడిగి తెలుసుకున్నారు. గూడూరు పట్టణంలోని పురపాలక సంఘ కార్యాలయంలో ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రజల నుండి పురపాలక సంఘంపై ఫిర్యాదులు వస్తున్నాయని ఎప్పటికప్పుడు అధికారులు సమస్యలు పరిష్కరించాలని ఎమ్మెల్యే సూచించారు. శాఖల వారీగా సమీక్షించారు. ఈ సందర్భంగా కమిషనర్ మల్లికార్జున్ మాట్లాడుతూ ప్రజలకు నిత్యవసరమైన మంచినీరు శానిటేషన్ సక్రమంగా ఉండేలా చూస్తున్నామని అన్నారు. శాఖల వారిగా అధికారులు ప్రజల నుండి వచ్చిన సమస్యలను తక్షణమే పరిష్కారమయ్యేలా చూడాలని ఆదేశించారు. ఈ సమావేశంలో నాయకులు కిరణ్ కుమార్ ,శ్రీనివాసులు ,బిల్లు చెంచురామయ్య,రహీం, వాటంబేడు శివకుమార్ , వాటంబేడు హరికుమార్, వేముల సునీల్, తదితరులు పాల్గొన్నారు.

# పేద విద్యార్థినికి ఆర్థిక సాయం

## అధ్యక్షులు ఎన్. కృష్ణంరాజు




గూడూరు (సింధూర దర్శిని) 24 సెప్టెంబర్ నెల్లూరు జిల్లా ; పేదలకు విద్యా , వైద్యం అందించడమే రోటరీ వెస్ట్ క్లబ్ యొక్క ముఖ్య లక్ష్యం అని ఆ అధ్యక్షులు ఎన్.కృష్ణంరాజు తెలియజేశారు. గూడూరు పట్టణంలోని డిఎన్ఆర్ కమ్యూనిటీ హాల్లో శ్రీలక్ష్మి అనే పేద ఇంజనీరింగ్ విద్యార్థినికి ల్యాప్ ట్యాప్ కు అవసరమయ్యే 16 వేల రూపాయలను రోటరీ వెస్ట్ క్లబ్ ఆధ్వర్యంలో సీనియర్ రొటేరియన్లు ఎల్లసిరి గోపాల్ రెడ్డి, ఎన్ కృష్ణంరాజు,టి.లీలా మోహన్, ఎం శ్రీనివాసులు దాతృత్వంతో అందజేశారు. ఈ కార్యక్రమంలో రొటేరియన్లు శ్రీకంటి రామ్మోహనరావు,నాసిన నాగులు, విజయ్ భాస్కర్ రెడ్డి, శ్రీనివాసులు, కోదండ రామయ్య,లక్ష్మీనారాయణ,దిలీప్ రెడ్డి, లీలా మోహన్ రెడ్డి,హరిప్రసాద్ రెడ్డి, బలరాంరెడ్డి, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు



గూడూరు (సింధూర దర్శిని) 24 సెప్టెంబర్ నెల్లూరు జిల్లా ; చిల్లకూరు మండల పరిధిలోని పాలిచెర్ల వారి పాళెం ఉన్నత పాఠశాలలో గురువారం సేవా సంకల్ప్ అభియాన్ లో భాగంగా విద్యార్థులకు చిత్ర లేఖనం పోటీలు నిర్వహించారు.వికసిత్ భారత్ 2047 తో పాటు,గత 25 ఏళ్ళ లో జరిగిన అభివృద్ధి, విద్యార్థుల దృష్టిలో వికసిత్ భారత్ ఎలా ఉండాలో అన్న అంశం పై చిత్ర లేఖనం పోటీలు నిర్వహించారు.మొదటి మూడు స్థానాల్లో ఎంపికైన విద్యార్థులకు ఈ నెల 28 న జరిగే మండల స్థాయి పోటీలకు అర్హత సాధించినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి రవూఫ్, ప్రధానోపాధ్యాయులు అనసూయ, ఉపాధ్యాయులు మాధవయ్య, ప్రజెంద్ర,డి.వి.రమణయ్య లు పాల్గొన్నారు. విజెత లను ఎంఇఓ, ప్రధానోపాధ్యాయులు అభినందించారు.

# సెల్ టవర్ నిర్మాణాన్ని అడ్డుకున్న ప్రజలు

గూడూరు (సింధూర దర్శిని) 24 సెప్టెంబర్ నెల్లూరు జిల్లా ; నివాసాల మధ్య సెల్ టవర్ నిర్మాణానికి ప్రభుత్వం అనుమతి రద్దు చేయాలని సెల్ టవర్ వల్ల ఎక్కువ రేడియేషన్ వచ్చి అనారోగ్య సమస్యలు వస్తున్నాయని ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని గూడూరు వాలయానందపురం వీధి స్థానికలు కోరుతున్నారు. గూడూరు పట్టణంలోని వాలయానందపురం వీధి లో సెల్ టవర్ నిర్మాణానికి స్థలాన్ని సిద్ధం చేశారు. ఆ ప్రాంతం వారు అడ్డుకున్నారు. స్థానిక మహిళల మాట్లాడుతూ ఇప్పటికే ఒక సెల్ టవర్ ఉందని మరలా ఇంకో టవర్ నిర్మాణానికి పనులు చేస్తున్నారని దీనివల్ల రేడియేషన్ ఎక్కువ వచ్చి అనారోగ్య సమస్యలు వస్తాయని ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకోవాలని వెంటనే అనుమతులు రద్దు చేయాలని కోరారు.







# పల్లె పండుగ-3.0 పర్యటనకు పటిష్ట భద్రతా ఏర్పాట్లు

నెల్లూరు( సింధూర దర్శిని) 24 సెప్టెంబర్ నెల్లూరు జిల్లా ;; నెల్లూరు జిల్లా వరికుంటపాడు మండలం రామాపురం గ్రామంలో ఈనెల 29వ తేదీన నిర్వహించనున్న “పల్లె పండుగ-3.0” కార్యక్రమానికి రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు , రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ హాజరుకానున్న నేపథ్యంలో జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేపడుతు న్నారు. ఈ నేపథ్యంలో నెల్లూరు జిల్లా ఎస్పీ డా. అజిత వేజెండ్ల, ఏపీఐఐసీ చైర్మన్ మంతెన రామరాజు , జిల్లా కలెక్టర్ మరియు జిల్లా మేజిస్ట్రేట్ హిమాన్షు శుక్ల, తో కలిసి రామాపురం గ్రామంలో పర్యటించి కార్యక్రమ ప్రాంగణం, హెలిప్యాడ్ ప్రాంతం, విఐపి రూట్, హోల్డింగ్ పాయింట్లు, పార్కింగ్ ప్రాంతాలు, ట్రాఫిక్ మార్గాలు తదితర ప్రాంతాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పరిశీలన అనంతరం ఎస్పీ ఆధ్వర్యంలో జిల్లా అధికారులతో ప్రత్యేక సమీక్షా సమావేశం నిర్వహించి, ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి పర్యటనకు సంబంధించిన భద్రత, ట్రాఫిక్ నియంత్రణ, విఐపి రూట్, హెలిప్యాడ్, పార్కింగ్, ప్రజల ప్రవేశ--నిష్క్రమణ మార్గాలు, అత్యవసర సేవలు తదితర అంశాలపై సమగ్రంగా సమీక్షించారు. విఐపి రూట్‌లో ఎటువంటి అంతరాయం లేకుండా అవసరమైన బందోబస్తు, బారికేడింగ్, ట్రాఫిక్ నియంత్రణ చర్యలు చేపట్టాలని, హెలిప్యాడ్ నుంచి కార్యక్రమ ప్రాంగణం వరకు సురక్షితమైన మార్గాన్ని ఏర్పాటు చేయాలని ఎస్పీ అధికారులను ఆదేశించారు. కార్యక్రమానికి వచ్చే విఐపి లు, అధికారులు, ప్రజల వాహనాల కోసం ప్రత్యేక పార్కింగ్, హోల్డింగ్ పాయింట్లు ఏర్పాటు చేసి, ట్రాఫిక్ రద్దీ లేకుండా ముందస్తు ప్రణాళికతో చర్యలు చేపట్టాలని సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో అంబులెన్స్‌లు, ఫైర్ టెండర్లు సులభంగా చేరుకునేలా ప్రత్యేక మార్గాలను అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా కార్యక్రమ ప్రాంగణం, హెలిప్యాడ్, విఐపి రూట్, పార్కింగ్ ప్రాంతాలు, ముఖ్యమైన కూడళ్ల వద్ద పటిష్టమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలని, ప్రతి అధికారి, సిబ్బందికి ముందుగానే విధులు కేటాయించి బ్రీఫింగ్ నిర్వహించాలని ఎస్పీ సూచించారు.అన్ని శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేసి తమకు కేటాయించిన బాధ్యతలను సకాలంలో పూర్తి చేయాలని, పర్యటనకు ముందు అన్ని ఏర్పాట్లను పూర్తిస్థాయిలో సిద్ధం చేయాలని అధికారులు సూచించారు.ఈ కార్యక్రమంలో కావలి ఆర్డీవో ఆత్మకూరు ఆర్డీవో , కావలి డిఎస్పి పి.వి. రమణ కుమార్ , నెల్లూరు రూరల్ డి.ఎస్.పి ఘట్టమనేని శ్రీనివాసరావు , ఇతర సర్కిల్ ఇన్స్పెక్టర్లు, సబ్ ఇన్స్పెక్టర్లు, పోలీసు అధికారులు మరియు సిబ్బంది పాల్గొన్నారు.

# సొంత నిధులతో అదనపు బోరు పాయింట్



గూడూరు ( సింధూర దర్శిని) 24 సెప్టెంబర్ నెల్లూరు జిల్లా ; చిల్లకూరు గ్రామంలో ప్రముఖ పారిశ్రామికవేత్త గంగ ప్రసాద్ జన్మదినాన్ని పురస్కరించుకుని ప్రజల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన ఉచిత మినరల్ వాటర్ ప్లాంట్‌ను 2026 ఏప్రిల్ 6వ తేదీన స్థానిక శాసనసభ్యులు డాక్టర్ పాశం సునీల్ కుమార్ ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రారంభించారు.ఈ వాటర్ ప్లాంట్ ఏర్పాటుకు పెంచలకోన దేవస్థానం మాజీ చైర్మన్ తానాంకి నానాజీ అందించిన సహాయ సహకారాలను గ్రామస్తులు ప్రత్యేకంగా గుర్తు చేసుకున్నారు. ముఖ్యంగా వాటర్ ప్లాంట్‌కు అవసరమైన అదనపు బోర్ పాయింట్‌ను తన సొంత నిధులతో ఏర్పాటు చేసేందుకు సహకరించినందుకు గ్రామ ప్రజలు ఆయనకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు.ప్రజలకు స్వచ్ఛమైన తాగునీటిని ఉచితంగా అందించాలనే ఉద్దేశంతో ఏర్పాటు చేసిన ఈ వాటర్ ప్లాంట్ ద్వారా గ్రామ ప్రజలకు , చుట్టుపక్క గ్రామ ప్రజలకు, రోడ్లో ప్రయాణించే వారికి ఎంతో ఉపయోగం కలుగుతోందని గ్రామస్తులు తెలిపారు. నీటి అవసరాలను దృష్టిలో ఉంచుకుని అదనపు బోర్ పాయింట్‌కు సహకరించడం పట్ల తానాంకి నానాజీ కి గ్రామస్తులు అభినందనలు తెలిపారు.ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ, “ప్రజల తాగునీటి అవసరాలను గుర్తించి వాటర్ ప్లాంట్‌కు అదనపు బోర్ పాయింట్ కోసం సొంత నిధులతో సహకరించిన తానాంకి నానాజీ కి చిల్లకూరు గ్రామ ప్రజల తరఫున హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

ఈ కార్యక్రమానికి గురువారం పూజా కార్యక్రమాలు నిర్వహించగా, పీఏసీఎస్ అధ్యక్షులు కొండా రామచంద్రారెడ్డి , దాసరి రాంప్రసాద్ మాజీ సర్పంచ్ నెల్లూరు రామ్మూర్తి , టీఎన్ఎస్ఎఫ్ నాయకులు కాటూరు నవీన్ చంద్ర , సుధాకర్, వాటర్ ప్లాంట్ సిబ్బంది కవిత ,తదితరులు పాల్గొన్నారు.

# నెల్లూరును కరవు జిల్లాగా ప్రకటించాలి - 20కోట్లు నిధులు కేటాయించాలి

## సి.పి.ఎం పార్టీ జిల్లా కార్యదర్శి మూలం రమేష్ డిమాండ్




గూడూరు (సింధూర దర్శిని) 24 సెప్టెంబర్ నెల్లూరు జిల్లా ; నెల్లూరు జిల్లాను కరువు ప్రాంతంగా ప్రకటించాలని రైతులకు రుణమాఫీ, కౌలు రైతులకు నష్టపరిహారం, అన్ని పంటలకు బీమా ప్రీమియం ప్రభుత్వమే చెల్లించాలని, సి.పి.ఎం పార్టీ నెల్లూరు జిల్లా కార్యదర్శి మూలం రమేష్ డిమాండ్ చేశారు. కరువు పరిశీలనా బృందం జిల్లా పర్యటనలో భాగంగా కరువు బృందం నాయకులు గురువారం గూడూరు సి.పి.ఎం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పత్రికా విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ పొదలకూరు,రాపూరు, సైదాపురం, మండలాల్లో రైతులు పంట పొలాలను పరిశీలించడం జరిగిందని, బొప్పాయి చెట్లు వైరస్ షోకి రైతులు తీవ్రంగా నష్టపోవడం జరిగిందని, నిమ్మ రేట్లు పడిపోయాయని, కండలేరులో సాలినన్ని నీళ్లు లేవని ఒకపక్క కరువు మరోపక్క నిత్యావసర ధరలు పెరిగిపోతున్నాయని బియ్యం కేజీ 70 రూపాయలు, చక్కెర 72 లకు చేరుకొన్నాయని, రాష్ట్ర ప్రభుత్వం ఈరోజుకి కూడా గ్రామీణ ప్రాంతాల్లో, మండల ప్రాంతాల్లో సందర్శించిన దాఖలాలు లేవని, ఆర్భాటంగా ప్రకటనలు చేస్తూ ఉంది.ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కాని,పవన్ కళ్యాణ్ కాని,ప్రకటనలకే పరిమితం కాకుండా జిల్లాకి సహాయక చర్యల్లో భాగంగా 20 కోట్లు నిధులు కేటాయిస్తే తప్ప ఈ జిల్లా రైతాంగానికి సమస్యలు పరిష్కారం కావని,”ఎల్ నినో” ప్రభావంతో రైతులు వరి అయితే పూర్తిగా దెబ్బతిని పోయిందని, ఈ ప్రభుత్వం వెంటనే స్పందించి జాతీయ విపత్తుగా పరిగనించి రాష్ట్రానికి లక్ష కోట్లు కేంద్ర నుంచి రాబడితే, తప్ప రైతాంగ సమస్యలు తీరవని “ఎల్ నినో” ప్రభావంగా రైతులు ఎదుర్కొనే దానికి సహాయక చర్యలు వెంటనే చేపట్టాలని రాష్ట్రంలో సి.పి.ఎం పార్టీ పలు సమస్యలపై మూడు బృందాలుగా తిరుగుతున్నాయని, రాష్ట్ర ప్రభుత్వం పై సమస్యలు పరిష్కారశీ చేయకపోతే పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టడం జరుగుతుందని ఆయన డిమాండ్ చేశారు. సి.పి.ఎం పార్టీ కార్యదర్శి వర్గ సభ్యులు మాదాల వెంకటేశ్వర్లు, ఎం మోహన్ రావు లు మాట్లాడుతూ కరువు పరిశీలనా బృందం పరిశీలనలో సైదాపురం లో బావులు, చెరువులు పూర్తిగా ఎండి పోయాయని,కరువు కాలుష్యం ఎక్కువగా ఉందని రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం వ్యవహరించకుండా కరువు నివారణ చర్యలు చేపట్టాలని ఎక్కడైతే పంటలు దెబ్బతిన్నాయో ప్రీమియం భీమా రాష్ట్ర ప్రభుత్వమే చెల్లించాలని, పంటల రుణాల్ని రైతులకు వెటనే రద్దు చేయాలని కరువు మండలాలు ప్రకటించాలని, రైతాంగాన్ని ఆదుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని వారు డిమాండ్ చేశారు.

ఈ కార్యక్రమంలో సి.పి.ఎం పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.పుల్లయ్య, మన్నూరు భాస్కరయ్య, సి.పి.ఎం పార్టీ జిల్లా కమిటీ సభ్యులు అల్లాడి గోపాల్, జిల్లా అవాజ్ కమిటీ సభ్యులు ఎస్కే. రషీద్, జిల్లా కౌలు రైతు సంఘం నాయకులు జోగి.శివకుమార్, పి.శ్రీనివాసులు, గూడూరు సి.ఐ.టి.యు పట్టణ కార్యదర్శి బి.వి.రమణయ్య, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు బి. నారాయణ, బి.చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

# పిల్లలకు పోషక విలువలు కలిగిన ఆహారం అందించాలి



గూడూరు (సింధూర దర్శిని) 24 సెప్టెంబర్ నెల్లూరు జిల్లా; గూడూరు ప్రాజెక్టు పరిధిలోని చిల్లకూరు మండలం కడివేడు ఎస్సీ అంగన్‌వాడీ కేంద్రం ఐసిడిఎస్ సిడిపిఓ షేక్. మెహబూబి ఆదేశాల మేరకు పోషణ మాహ్ కార్యక్రమంలో భాగంగా థీమ్-3: “సమాజ భాగస్వామ్యం మరియు జవాబుదారితనం” అనే అంశంపై గర్భిణీలు, బాలింతలు మరియు తల్లులతో సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సమావేశంలో తల్లులకు పిల్లలు, గర్భిణీలు మరియు బాలింతల ఆరోగ్యం, పోషకాహారం, పరిశుభ్రత, ఆరోగ్య సంరక్షణలో కుటుంబంతో పాటు సమాజం కూడా బాధ్యతగా భాగస్వామ్యం కావాల్సిన అవసరాన్ని వివరించడం జరిగింది. అంగన్‌వాడీ కేంద్రం ద్వారా అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలని, పిల్లలకు పోషక విలువలు కలిగిన ఆహారం అందించాలని మరియు ఆరోగ్యకరమైన అలవాట్లను పాటించాలని అవగాహన కల్పించడం జరిగింది.ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ రేణుక, అంగన్‌వాడీ కార్యకర్తలు సుగుణ, రాధా, తిమ్మనగారి పాలెం పద్మ మరియు అంగన్‌వాడీ హెల్పర్ సునీత పాల్గొన్నారు.

# పదవులు ముగిసినా ప్రజలతో అనుబంధం శాశ్వతం.. ప్రజాసేవే ముఖ్యం

## పాలకవర్గానికి వీడ్కోలు సన్మాన సభలో ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి




కోవూరు( సింధూర దర్శిని) 24 సెప్టెంబర్ నెల్లూరు జిల్లా ; కోవూరు మండల ప్రజాపరిషత్‌లో ఐదేళ్ల పదవీకాలం పూర్తి చేసుకున్న ఎంపీపీ, వైస్ ఎంపీపీ, జడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యులకు గురువారం ఉదయం వీడ్కోలు సన్మాన సభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కోవూరు శాసనసభ్యులు వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా స్థానిక పరిషత్ ప్రజాప్రతినిధులను ఎమ్మెల్యే ఈ సందర్భంగా స్థానిక పరిషత్ ప్రజాప్రతినిధులను శాలువాలతో సత్కరించి, ఐదేళ్లపాటు వారు అందించిన సేవలను ఎమ్మెల్యే అభినందించారు.

**పదవులు తాత్కాలికం.. ప్రజాసేవ నిరంతరం**

సభలో ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి మాట్లాడుతూ పదవి ఏదైనా ప్రజలు నమ్మి గెలిపించినప్పుడు ఆ బాధ్యతను సక్రమంగా నిర్వర్తించాలని అన్నారు. పదవీకాలం ముగిసినంత మాత్రాన ప్రజలతో ఉన్న అనుబంధం ముగిసిపోదని, ప్రజలకు సేవ చేయాలనే ఆలోచన ఉన్నంతకాలం ప్రతి ఒక్కరూ నాయకులేనని పేర్కొన్నారు. పార్టీలకు అతీతంగా గత ఐదేళ్లుగా ప్రజలకు అందుబాటులో ఉంటూ, తమ ప్రాంత సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి, అభివృద్ధి కార్యక్రమాల్లో భాగస్వాములైన ప్రజాప్రతినిధులందరికీ ధన్యవాదాలు తెలిపారు. స్థానిక సంస్థల్లో పనిచేసిన ఈ ఐదేళ్ల అనుభవాన్ని భవిష్యత్తులోనూ కోవూరు మండల అభివృద్ధికి ఉపయోగించాలని కోరారు.

**రూ.2 కోట్లతో అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు**

కోవూరు పరిధిలో రోడ్లు, సీసీ డ్రెయిన్ల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామని ఎమ్మెల్యే తెలిపారు. ఎంపీ ల్యాడ్స్ నుడా , సీఎస్ఆర్ ఇతర నిధులను సమన్వయం చేసి, త్వరలోనే దాదాపు రూ.2 కోట్ల అంచనా వ్యయంతో అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేయనున్నట్లు వెల్లడించారు. ప్రజలకు ఇచ్చిన హామీలను దశలవారీగా నెరవేర్చేందుకు కృషి చేస్తున్నామని, కోవూరు అభివృద్ధిలో ప్రతి ఒక్కరి సహకారం అవసరమని ఎమ్మెల్యే పేర్కొన్నారు.

**మళ్లీ ప్రజాసేవలో భాగస్వాములు కావాలి**

త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికలను ప్రస్తావిస్తూ.. కోవూరు మండల అభివృద్ధికి తోడ్పడాలనే తపన, ఆలోచన ఉన్న నాయకులు చాలామంది ఉన్నారని ఎమ్మెల్యే తెలిపారు. ప్రజాసేవ చేయాలనే ఆసక్తి, అంకితభావం ఉన్న ప్రతి ఒక్కరికీ మంచి అవకాశం రావాలని ఆకాంక్షించారు. ప్రజల ఆశీర్వాదంతో మళ్లీ గెలిచి ప్రజాసేవలో భాగస్వాములు కావాలని కోరారు. కోవూరు అభివృద్ధిలో భాగస్వాములైన ప్రజాప్రతినిధులకు, సహకరించిన అధికారులకు ఈ సందర్భంగా ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

# జాబ్ మేళా పోస్టర్ ఆవిష్కరించిన జిల్లా కలెక్టర్



తిరుపతి (సింధూర దర్శిని) 24 సెప్టెంబర్ తిరుపతి జిల్లా ; తిరుపతి జిల్లా కలెక్టర్, డా. ఎస్. వెంకటేశ్వర్ చేతుల మీదుగా శ్రీ సాయి డిగ్రీ మరియు పీజీ కాలేజ్, రైల్వే.కోడూరు లో నిర్వహించబడుతున్న జాబ్ మేళా పోస్టర్ ఆవిష్కరణ. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఎంప్లాయిమెంట్ ఎక్స్చేంజ్ మరియు సీడాప్ సంయుక్త ఆధ్వర్యంలో 28-09-2026 ( సోమవారం ) ఉదయం 8.30 గంటలకు, శ్రీ సాయి డిగ్రీ మరియు పీజీ కాలేజ్, సాయి నగర్, రైల్వే కోడూరు లో తిరుపతి జిల్లాలో నిర్వహించనున్న జాబ్ మేళా పోస్టర్‌ను ఈరోజు తిరుపతి జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్, ఐ.ఏ.ఎస్. కలెక్టరేట్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, తిరుపతి జిల్లా మరియు పరిసర ప్రాంతాల నిరుద్యోగ యువతీ యువకులకు ఉపాధి అవకాశాలు కల్పించడమే ఈ జాబ్ మేళా ప్రధాన ఉద్దేశ్యమని తెలిపారు. 12 ప్రముఖ బహుళజాతి సంస్థలు ఈ జాబ్ మేళాలో పాల్గొని వివిధ విభాగాల్లో ఉద్యోగాల కోసం అభ్యర్థులను ఎంపిక చేయనున్నాయని పేర్కొన్నారు.

విద్య అర్హత; 10వ తరగతి, ఇంటర్మీడియట్, ఐటీఐ, డిప్లొమా, ఏదైనా డిగ్రీ లేదా పీజీ ఉత్తీర్ణులైన అర్హులైన యువతీ యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వయసు:18 నుండి 35 సంవత్సరాల లోపల అభ్యర్థులు ముందస్తుగా Naipunyam Portal ద్వారా నమోదు చేసుకొని, Build Your Resume ద్వారా ప్రొఫైల్ పూర్తిచేసి, సంబంధిత కంపెనీలకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. స్పాట్ రిజిస్ట్రేషన్ సౌకర్యం కూడా అందుబాటులో ఉంటుందని తెలిపారు.

రిజిస్ట్రేషన్ లింక్: https://naipunyam.ap.gov.in/
మరిన్ని వివరాలకు: 9052717078 , 9988853335 (కాల్ సెంటర్)

ఈ కార్యక్రమంలో ఆర్.గోవిందరావు, జాయింట్ కలెక్టర్ తిరుపతి జిల్లా, జి రవికుమార్, ఎల్డీఎం, తిరుపతి జిల్లా,ఆర్.లోకనాథం, జిల్లా నైపుణ్య అభివృద్ధి అధికారి, సునేష్ బాబు ఎన్ టి ఓ,సులేమాన్ భాష, ప్లేస్మెంట్ ఆఫీసర్ తదితరులుపాల్గొన్నారు.

# విద్యారంగ సమస్యల పరిష్కారానికై పోరాడాలి




### పిడి ఎస్ యు మాజీ రాష్ట్ర అధ్యక్షులు యు. గనిరాజు

నెల్లూరు (సింధూర దర్శిని) 24 సెప్టెంబర్ నెల్లూరు జిల్లా ; కేంద్రంలోని మోదీ ప్రభుత్వం, రాష్ట్రంలో చంద్రబాబు కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న విద్యార్థి, నిరుద్యోగ వ్యతిరేక విధానాలపై సమరశీలంగా ఉద్యమించాలని పిడి ఎస్ యు మాజీ రాష్ట్ర అధ్యక్షులు యు.గనిరాజు పిలుపునిచ్చారు. ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం నెల్లూరు నగర 17వ మహాసభల సందర్భంగా గురువారం వి.ఆర్.సి సెంటర్ నుండి మెయిన్ రోడ్ మీదుగా సర్వోదయ కళాశాల గ్రౌండ్ వరకు వందల మంది విద్యార్థులతో మహా ప్రదర్శన నిర్వహించారు. " పి డి ఎస్ యు జిందాబాద్", "విద్యా రంగ సమస్యలు పరిష్కరించాలి", "ప్రభుత్వ విద్యా రంగాన్ని కాపాడుకుందాం", "ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల ఫీజుల దోపిడీని అరికట్టాలి", "6450 కోట్ల ఫీజు రియంబర్స్ మెంట్, స్కాలర్ షిప్ బకాయిలు విడుదల చేయాలి", "ఖాళీగా ఉన్న 2.5 లక్షల ఉద్యోగాలను భర్తీ చేయాలి", "డి.ఎస్.సి అక్రమాలపై సమగ్ర దర్యాప్తు జరిపించాలి" అని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా గనిరాజు మాట్లాడుతూ కేంద్రంలోని మోదీ ప్రభుత్వం ప్రతి సంవత్సరం బడ్జెట్లో విద్యా రంగానికి నిధులు కోత విధిస్తుందని అన్నారు. కొఠారీ కమిషన్ ఆరు దశాబ్దాల క్రితమే బడ్జెట్లో కేంద్రం 10%, రాష్ట్రం 30% నిధులు కేటాయించాలని సూచించినా ఏ ప్రభుత్వం అమలు చేయడం లేదని విమర్శించారు. దేశ వ్యాప్తంగా 950 పైగా ఉన్న యూనివర్సిటీలు సమస్యలతో కునారిల్లుతున్నాయని, వేలాది ప్రొఫెసర్, టీచింగ్, నాన్ టీచింగ్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని, 10 లక్షలకు పైగానే టీచర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని అన్నారు. పాఠశాల స్థాయి నుండి విద్యారంగంలో మనువాద భావజాలాన్ని విద్యార్థుల మెదళ్ళలోకి చొప్పించడానికి నూతన జాతీయ విద్యా విధానం-2020 తీసుకు వచ్చిందని అన్నారు. విద్యారంగ కాషాయకరణ, కార్పొరేటీకరణ, కేంద్రీకరణ పెరిగి పోయిందని అన్నారు. ప్రతిష్టాత్మక కేంద్రీయ విద్యాసంస్థలలో 2018-23 మధ్య 98మంది విద్యార్థులు కుల వివక్షకు బలై పోయారాని అన్నారు. మొన్న బాంబే ఐఐటిలో కూడా విద్యార్థి కుల వివక్షకు బలై పోయాడని అన్నారు. కుల, మత అసమానతలు లేని, శాస్త్రీయ విద్యకై ఉద్యమించాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో చంద్రబాబు కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థి, యువజన, ప్రజా వ్యతిరేక విధానాలను అమలు చేస్తుందని దుయ్య బట్టారు. విద్యా, ఉద్యోగ, ఉపాధి హక్కులకై విద్యార్థి లోకం ఉద్యమించాలని గనిరాజు పిలుపునిచ్చారు. ఈ ప్రదర్శనలో అరుణోదయ రాష్ట్ర సహాయ కార్యదర్శి జి.శ్రీను, రాష్ట్ర నాయకులు రజియా, నాగలక్ష్మి బృందం విప్లవ గేయాలు ఆలపించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు ఫయాజ్, నగర ఉపాధ్యక్షులు హర్షవర్ధన్ రెడ్డి, నగర నాయకులు సంతోష్, యస్వంత్, విష్ణు, భాషా తదితరులు పాల్గొన్నారు.




# హత్యాయత్నం కేసులో నిందితులు అరెస్టు

### త్వరితగతిన అరెస్ట్ చేసిన నవాబ్‌పేట పోలీసులు

నెల్లూరు (సింధూర దర్శిని) 24 సెప్టెంబర్ నెల్లూరు జిల్లా; నెల్లూరు నవాబ్‌పేట పోలీస్ స్టేషన్ పరిధిలో బహిరంగ ప్రదేశంలో జరిగిన హత్యాయత్నం కేసులో నిందితులను నవాబ్‌పేట పోలీసులు అత్యంత త్వరితగతిన అరెస్ట్ చేశారు. గురువారం ఉదయం సుమారు 11.00 గంటల సమయంలో నవాబ్‌పేటలోని మహాలక్ష్మమ్మ గుడి ఎదురుగా, పొర్లుకట్టకు చెందిన మర్లపాటి ప్రదీప్ పై ఇద్దరు వ్యక్తులు ఆటోను అడ్డగించి, కళ్లలో కారం కొట్టి, కత్తితో గొంతుపై దాడి చేసి పరారయ్యారు. ఈ ఘటనపై బాధితుడి తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు నవాబ్‌పేట పోలీసులు బి ఎన్ ఎస్ కింద కేసు నమోదు చేశారు. ఈ ఘటనను జిల్లా ఎస్పీ డాక్టర్ అజిత వేజెండ్ల తీవ్రంగా పరిగణించి, నిందితులను వెంటనే అరెస్ట్ చేయాలని ఆదేశించారు. ఎస్పీ ఆదేశాల మేరకు అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) సి.హెచ్. సౌజన్య సూచనలతో, నెల్లూరు టౌన్ దీక్షా, ఆధ్వర్యంలో నవాబ్‌పేట సీఐ మరియు సిబ్బంది ప్రత్యేకంగా చర్యలు చేపట్టి, నేరం జరిగిన కొద్ది గంటల్లోనే పరారీలో ఉన్న నిందితులను అదుపులోకి తీసుకున్నారు. అరెస్ట్ చేసిన నిందితులను మన్నేపల్లి సునీల్ (31), మన్నేపల్లి సాయి (28) గా పోలీసులు గుర్తించారు. నిందితులను 24.09.2026 సాయంత్రం 5.30 గంటలకు పెన్నా బ్రిడ్జి కింద, పాత చెక్‌పోస్ట్ వద్ద అరెస్ట్ చేశారు. పోలీసుల విచారణలో, గతంలో జరిగిన ఒక హత్యకు సంబంధించి కక్ష పెంచుకున్న నిందితులు, అవకాశం కోసం ఎదురుచూస్తూ ప్రదీప్‌పై పథకం ప్రకారం దాడికి పాల్పడినట్లు వెల్లడైనట్లు పోలీసులు తెలిపారు. అనంతరం నిందితులను అరెస్ట్ చేసి న్యాయస్థానం ముందు హాజరుపరిచి జైలుకు తరలించారు. ఈ కేసును వేగవంతంగా ఛేదించి, నేరం జరిగిన కొద్ది గంటల్లోనే నిందితులను అరెస్ట్ చేసిన నవాబ్‌పేట సీఐ మరియు సిబ్బందిని జిల్లా ఎస్పీ డాక్టర్ అజిత వేజెండ్, అభినందించారు. అలాగే కేసు దర్యాప్తులో సమన్వయంతో పనిచేసిన, నెల్లూరు టౌన్ దీక్షా మరియు నవాబ్‌పేట ఇన్స్పెక్టర్ మరియు పోలీసు సిబ్బందిని ఎస్పీ ప్రత్యేకంగా ప్రశంసించారు. నేరాలకు పాల్పడే వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని, ప్రజల భద్రతకు ఎటువంటి ముప్పు కలగకుండా జిల్లా పోలీసులు నిరంతరం అప్రమత్తంగా పనిచేస్తారని జిల్లా ఎస్పీ డాక్టర్ అజిత వేజెండ్ల తెలిపారు.

# గోడౌన్ల వద్ద పటిష్ట భద్రత చర్యలు తీసుకోవాలి

### జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల



నెల్లూరు( సింధూర దర్శిని) 24 సెప్టెంబర్ నెల్లూరు జిల్లా ; భారత ఎన్నికల సంఘం మార్గదర్శకాలను కచ్చితంగా అమలు చేస్తూ ఈవీఎం గోడౌన్ల వద్ద పటిష్ట భద్రతా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల అధికారులకు సూచించారు. గురువారం నగరంలోని ఆర్డీవో కార్యాలయ ప్రాంగణంలో గల ఈవీఎం గోడౌన్లను రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలిసి జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ఈవీఎంలు భద్రపరిచిన మూడు గోడౌన్లను క్షుణ్ణంగా పరిశీలించిన కలెక్టర్ అధికారులకు పలు సూచనలు చేశారు. ఎన్నికల సంఘం సూచించిన నిబంధనల మేరకు ఈవీఎం గోడౌన్ల వద్ద అన్ని చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ విజయ్ కుమార్, టిడిపి, బీజేపీ, వైసీపీ, కాంగ్రెస్ పార్టీల ప్రతినిధులు, ఎలక్షన్ సెక్షన్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# గణపయ్యను దర్శించుకున్న ప్రముఖ సినీనటి



కాణిపాకం ( సింధూర దర్శిని) 24 సెప్టెంబర్ చిత్తూరు జిల్లా ; కాణిపాకం స్వయంభు శ్రీ కాణిపాక వరసిద్ధి వినాయక స్వామివారిని దర్శించుకున్న ప్రముఖనటి (హీరోయిన్)డింపుల్ హయాతి, స్వామివారిని దర్శించుకున్నారు, వీరికి దర్శన ఏర్పాట్లు చేసి స్వామివారి తీర్థప్రసాదాలు అందజేసిన దేవస్థానం ఈ.వో పెంచల కిషోర్ , తదితరులు పాల్గొన్నారు.

# ప్రముఖ వేద భాష్య పండితులచే ఉపన్యాసం

కాణిపాకం (సింధూర దర్శిని) 24 సెప్టెంబర్ చిత్తూరు జిల్లా ; కాణిపాకం స్వయంభు శ్రీ కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి వారి దేవస్థానం వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం వేద సభ (వేద సదస్యము) ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర లోని వివిధ ప్రముఖ దేవాలయాల నుండి వచ్చిన వేద పండితులచ్చే ఉదయం నుంచి సాయంత్రం వరకు చతుర్వేద పారాయణం, చతుర్వేద స్వస్తి,



మరియు వేద ప్రశస్తి గురించి ప్రముఖ వేదభాష్య పండితులచే ఉపన్యాసం తరువాత వేద పండితులకు సత్కార కార్యక్రమము నిర్వహించడం జరిగింది, ఈ కార్యక్రమంలో దేవస్థానం ఈ.వో పెంచల కిషోర్, చైర్మన్ మణి నాయుడు , బోర్డు సభ్యులు ఆలయ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# చిన్న, మధ్యతరహా పరిశ్రమల విజయానికి ఐదు అంశాలు కీలకం

**జిల్లాలో పరిశ్రమల స్థాపనకు అవకాశాలు మెండు**

**ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు సంపూర్ణ సహకారం అందిస్తాం**

**అవకాశాలను సృష్టించుకుని పారిశ్రామికవేత్తలుగా ఎదగాలి**

**జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల పిలుపు**

**ఎం ఎస్ ఎం ఈ వర్క్‌షాప్‌కు విశేష స్పందన**




నెల్లూరు (సింధూర దర్శిని) 24 సెప్టెంబర్ నెల్లూరు జిల్లా ; చిన్న, మధ్యతరహా పరిశ్రమల విజయానికి సరైన ఉత్పత్తి ఎంపిక, ఆధునిక సాంకేతికత, ప్రాజెక్టు ఫైనాన్సింగ్, డిజిటైజేషన్, ఈ-కామర్స్-డిజిటల్ మార్కెటింగ్ అనే ఐదు అంశాలు కీలకమని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల తెలిపారు. గురువారం ఉదయం నెల్లూరు శ్రీ వెంకటేశ్వర కస్తూర్బ కళాక్షేత్రంలో జిల్లా పరిశ్రమల శాఖ, ఏపీఐఐసీ, ఎంఎస్ఎంఈ శాఖల ఆధ్వర్యంలో నిర్వహించిన 'వన్ ఫ్యామిలీ--వన్ ఎంటర్‌ప్రెన్యూర్' ఎంఎస్ఎంఈ వర్క్‌షాప్‌లో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో రిజిస్ట్రేషన్ డెస్క్, బ్యాంకుల స్టాల్స్, ఉద్యమ రిజిస్ట్రేషన్, ఎంఎస్ఎంఈ రిజిస్ట్రేషన్లకు ప్రత్యేక డెస్క్‌లను ఏర్పాటు చేశారు. వివిధ ప్రభుత్వ పథకాలు, రుణ సదుపాయాలు, సబ్సిడీలు, పరిశ్రమల స్థాపనకు అవసరమైన అనుమతులపై అధికారులు అవగాహన కల్పించారు. బ్యాంకింగ్ రంగ నిపుణులు రుణాల మంజూరు, ప్రాజెక్టు నివేదికలు, వడ్డీ రేట్లు, రుణాల తిరిగి చెల్లింపు విధానాలపై ఔత్సాహికులకు వివరించారు. వ్యాపారం ప్రారంభించే ముందు స్థానికంగా, భవిష్యత్తులో ఏర్పడే పారిశ్రామిక అవకాశాలను అధ్యయనం చేసి సరైన ఉత్పత్తిని ఎంపిక చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. జిల్లాలో ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు కానున్న బీపీసీఎల్ రిఫైనరీ నిర్మాణంతో వెల్డింగ్ రాడ్లు, ఆక్సిజన్, జేసీబీలు, వివిధ నిర్మాణ సేవలకు డిమాండ్ ఏర్పడే అవకాశం ఉందన్నారు. రిఫైనరీ పూర్తయిన అనంతరం లభించే పెట్రోకెమికల్ ఉత్పత్తులను వినియోగించి వైర్లు, స్విచ్‌బోర్డులు తదితర తుది ఉత్పత్తుల తయారీకి అవకాశాలను పరిశీలించాలని తెలిపారు. నిర్మాణ దశకు మాత్రమే పరిమితమయ్యే వ్యాపారాల్లో పెట్టుబడులు పెట్టేటప్పుడు కాలపరిమితి, పెట్టుబడి రాబడి, రుణ చెల్లింపులను పరిగణనలోకి తీసుకోవాలని సూచించారు.

ఆధునిక సాంకేతికతను వినియోగించడం ద్వారా ఉత్పత్తి వ్యయాన్ని తగ్గించుకోవచ్చని, నాణ్యతతో పాటు ఒక్కో ఉత్పత్తిపై వచ్చే మార్జిన్‌పై దృష్టి పెట్టాలని కలెక్టర్ పేర్కొన్నారు. వ్యాపారం ప్రారంభ దశలో అవసరానికి మించి రుణాలు తీసుకోవద్దని, వడ్డీ రేటుతో పాటు మారటోరియం కాలం, నగదు ప్రవాహాన్ని పరిశీలించి ఫైనాన్సింగ్ ప్రణాళిక రూపొందించుకోవాలని సూచించారు. అవసరమైన మేరకే రుణం తీసుకుని, ఆదాయం-ఖర్చులను సమతుల్యంగా నిర్వహించుకోవాలని చెప్పారు.

వ్యాపారం విస్తరించినప్పుడు కొనుగోళ్లు, అమ్మకాలు, ఖర్చులు, అకౌంటింగ్, ఉత్పత్తి నిర్వహణ వంటి కార్యకలాపాలను డిజిటల్ వ్యవస్థల ద్వారా పర్యవేక్షించుకోవాలని తెలిపారు. యజమాని ఎక్కడ ఉన్నా తన పరిశ్రమలో జరుగుతున్న కార్యకలాపాలకు సంబంధించిన సమాచారం మొబైల్ ద్వారా అందేలా డిజిటల్ వ్యవస్థలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.

ప్రస్తుత పరిస్థితుల్లో ఈ-కామర్స్, డిజిటల్ మార్కెటింగ్‌కు ఎంతో ప్రాధాన్యత ఉందని కలెక్టర్ తెలిపారు. సోషల్ మీడియా, ఇన్‌స్టాగ్రామ్, ఈ-కామర్స్ వేదికలను వినియోగించుకుని ఉత్పత్తులను విస్తృత మార్కెట్‌కు చేరువ చేయాలని సూచించారు. ఆన్‌లైన్ విక్రయాల ద్వారా విస్తృత మార్కెట్‌ను అందిపుచ్చుకోవడంతో పాటు వ్యాపార నిర్వహణ వ్యయాలను తగ్గించుకునే అవకాశాలను పరిశీలించాలని చెప్పారు. జిల్లాలో రాబోయే రోజుల్లో ఏర్పడనున్న పరిశ్రమలు, పారిశ్రామిక మౌలిక వసతులను దృష్టిలో పెట్టుకుని ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు కొత్త అవకాశాలను గుర్తించి ముందుకు రావాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. ప్రభుత్వం రుణాలు, సబ్సిడీలు, ఇతర ప్రోత్సాహకాలు, హ్యాండ్‌హోల్డింగ్ ద్వారా అవసరమైన సహకారం అందిస్తుందని తెలిపారు. వర్క్‌షాప్‌లో పాల్గొన్న ఔత్సాహికులు నిపుణులు, సంబంధిత శాఖల అధికారులను సంప్రదించి తమ సందేహాలను నివృత్తి చేసుకోవాలని సూచించారు.

ఈ సందర్భంగా నగర మేయర్ దేవరకొండ సుజాత మాట్లాడుతూ రాబోయే రోజుల్లో జిల్లాలో ప్రభావవంతమైన పరిశ్రమలు ఏర్పడనున్న నేపథ్యంలో పరిశ్రమల స్థాపనకు ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలు, రుణ సదుపాయాలు, వివిధ రాయితీలను ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రతి కుటుంబం నుంచి ఒక పారిశ్రామికవేత్త రావాలన్న ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా యువత, మహిళలు, నిరుద్యోగులు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. పరిశ్రమల స్థాపన ద్వారా ఉపాధి అవకాశాలు పెరగడంతో పాటు స్థానిక ఆర్థిక వ్యవస్థ బలోపేతం అవుతుందని తెలిపారు.

కార్యక్రమంలో ఎంఎస్ఎంఈ డైరెక్టర్ వీరేంద్ర కుమార్, ఏపీఐఐసీ డైరెక్టర్ కంచర్ల మాధవి, జిల్లా పరిశ్రమల శాఖ జీఎం శ్రీధర్ బాబు, ఏపీఐఐసీ జెడ్ఎం శివకుమార్, ఎల్‌డీఎం మణిశేఖర్, చాంబర్ ఆఫ్ కామర్స్ నెల్లూరు ప్రతినిధులు ఒమ్మిన సతీష్ కుమార్, శేఖర్ రెడ్డి, డీఆర్‌డీఏ పీడీ నాగరాజుకుమారి, ఇండియా ఎస్ఎంఈ ఫోరం ప్రతినిధులు, బ్యాంకింగ్ ప్రముఖులు, పారిశ్రామికవేత్తలు, ఔత్సాహికులు పాల్గొన్నారు.



## సేవా సంకల్ప అభియాన్ వైద్య, ఆరోగ్య శిబిరాలు

చాపాడు (సింధూరదర్శిని) 24 సెప్టెంబర్ కడపజిల్లా; చాపాడు మండలంలోని నక్కలదిన్నె ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అల్లాడు పల్లె ఆయుస్మాన్ ఆరోగ్య మందిర్ పరిదిలో విజయనగరం, అల్లాడుపల్లె గ్రామాలలో " సేవా సంకల్ప అభియాన్ " వైద్య మరియు ఆరోగ్య శిబిరాలు నిర్వహించినట్లు నక్కల దిన్నె ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ పి.కావ్య మాధురి పేర్కొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ పి.కావ్య మాధురి మాట్లాడుతూ సెప్టెంబర్ నెల 17 వ తేదీ నుంచి ప్రారంభం అయిన సేవా సంకల్ప అభియాన్ అక్టోబర్ నెల 17 తేదీ వరకు జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా విజయనగరం గ్రామంలో ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించి అవసరమైన వారికి పరీక్షలు, మందులు పంపిణీ చేశారు.ప్రస్తుతం జరుగుతున్న కార్యక్రమాలపై ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలిపారు. ప్రోగ్రాం లో ప్రధానంగా సంక్రమిత, అసంక్రమిత వ్యాధుల స్క్రీనింగ్, హైపర్ టెన్సన్, డయాబెటిస్ పరీక్షలు, గర్భిణుల గుర్తింపు, మరియు వారికి ఆరోగ్య పరీక్షలు ఊబకాయం (ఒబెసిటీ) స్క్రీనింగ్, బిపి,షుగర్ , సమస్యల గుర్తింపు, వ్యాధినిరోధక టీకాల "లెఫ్ట్ ఔట్, డ్రాప్ ఔట్"లాంటి పిల్లల గుర్తింపు, అవసరమైన వారికి తదుపరి వైద్య సేవలకు రెఫర్ చేయడం, ప్రజలు ఈ వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకొని తమ ఆరోగ్యాన్ని. క్రమం తప్పకుండా పరీక్షించుకోవాలని. డాక్టర్ పి. కావ్య మాధురి స్పష్టం చేశారు.. అదే గ్రామాలలో ప్రభుత్వం చేపట్టిన ఇంటింటి కుష్టు వ్యాధి స్క్రీనింగ్ ను తనిఖీ చేశారు.. కుష్టు వ్యాధిని గూర్చి మాట్లాడుతూ వ్యాధిని తొలి దశలోనే గుర్తించి బాధితులకు సకాలంలో చికిత్స అందించడం ద్వారా అంగవైకల్యాన్ని పూర్తిగా నివారించడం అని ఆమె తెలియజేశారు. చర్మంపై రాగి రంగులో లేదా ఎర్రగా స్పర్శ లేని మచ్చలు ఉంటే, దురద లేని మచ్చలు,లాంటివి ఉంటే నిర్లక్ష్యం చేయకుండా వెంటనే ఆరోగ్య సిబ్బంది దృష్టికి తీసుకుని రావాలన్నారు. సేవా సంకల్ప అభియాన్ కార్యక్రమంపై విజయనగరంలో ప్రజలతో వైద్యాధికారి, వైద్య ఆరోగ్య సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణ అధికారి యం రాఘవయ్య, సూపర్ వైజర్ భవానీ, యం ఎల్ హెచ్ పి రాజేశ్వరి ఎ ఎన్ యం అంజనమ్మ ఆశా కార్యకర్తలు,104 సిబ్బంది, అంగన్వాడీ సిబ్బంది పాఠశాల ఉపాధ్యాయుడు వివేకానంద రెడ్డి గ్రామాల ప్రజలు పాల్గొన్నారు..

## వైభవంగా స్వామి వారికి అభిషేకం

గూడూరు(సింధూరదర్శిని) 24 సెప్టెంబర్ నెల్లూరు జిల్లా;గూడూరు పట్టణంలోని రైల్వేక్వార్టర్స్ వద్ద ఉన్న శ్రీవరసిద్ధి వినాయక స్వామి దేవస్థానం లో వినాయక చవితి నవరాత్రి వేడుకలు ముగిసాయి. పలు రకాల పుష్పాలతో స్వామివారికి అలంకరణ ఏర్పాటు చేసి మంగళ వాయిద్యాలతో పల్లకి సేవ పలు రకాల సుగంధ ద్రవ్యాలతో అభిషేకం పుష్పయాగం వైభవం గా నిర్వహించారు. భక్తుల పూజా కార్యక్రమాల్లో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.





## అధికారానంది వాహనంపై ఊరేగిన విఘ్న వినాయకుడు

**ఆలయ ఈవో పెంచల కిషోర్**



కాణిపాకం (సింధూర దర్శిని) 24 సెప్టెంబర్ చిత్తూరు జిల్లా ; కాణిపాకం స్వయంభు శ్రీ కాణిపాక వరసిద్ధి వినాయక స్వామివారి దేవస్థానం వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం రాత్రి అధికారనంది వాహనం పై భక్తులకు దర్శనమిచ్చిన విఘ్న వినాయకుడు, ఈ కార్యక్రమంలో దేవస్థానం ఈవో పెంచల కిషోర్ ,ఉభయదారులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## తాటి విత్తనాలు నాటిన కడప ఫారెస్ట్ సిబ్బంది

సిద్ధవటం, సింధూరదర్శిని: కడప ఫారెస్ట్ రేంజ్ పరిధిలోని కనుమలోపల్లి, బిట్ భాకరాపేట సమీపాన కడప ఫారెస్ట్ రేంజ్ సిబ్బంది తాటి విత్తనాలు కూలీలచే నాటించారు సిద్ధవటం మండలంలోని కడప చెన్నై జాతీయ రహదారి కడప ఫారెస్ట్ రేంజ్ పరిధి, కనుమలోపల్లి, కేజీ పెంట అటవీ బీట్లల్లో, కడప డిఎఫ్ఓ రాజశేఖర్ ఆదేశాలతో కడపఫారెస్ట్ రేంజ్ అధికారి ప్రసాద్ సూచన మేరకు కడప ఫారెస్ట్ రేంజ్ పరిధి కేజీ పెంట, కనుమలోపల్లి అటవీ బీట్, భాకరాపేట సమీపాన తాటి విత్తనాలు నాటారు.

ఈ సందర్భంగా గురువారం, ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ శ్రీనివాసులు మాట్లాడుతూ ఫారెస్ట్ సరిహద్దుల వెంబడి కేజీ పెంట, కనుమల్లోపల్లి ఫారెస్ట్ బిట్ల సమీపంలో కూలీలచే 2 వేలు పైబడి విత్తనాలు నాటామని వన్యప్రాణుల ఆహారానికి తాటికాయలు ఉపయోగపడతాయని పచ్చని చెట్లు పెంచేందుకు ప్రతి ఒక్కరు కృషి చేసి అటవీ ప్రాంతాన్ని పచ్చదనంతో ఉండే చెట్లు సహకరించాలన్నారు ఈ కార్యక్రమంలో సెక్షన్ ఆఫీసర్ శ్రీనివాసులు, ఎఫ్ బి ఓ, రాజశేఖర్, పార్వతి, కూలీలు పాల్గొన్నారు.

# ఆయుష్మాన్ భారత్.. ఎనిమిదేళ్లలో కుటుంబాలకు రూ.2లక్షల కోట్ల ఆదా

ఆయుష్మాన్ భారత్ పథకానికి ఎనిమిదేళ్లు పూర్తి

60 కోట్ల మందికి రూ. 5 లక్షల వార్షిక ఆరోగ్య రక్షణ

దేశవ్యాప్తంగా 1.86 లక్షల ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌ల ఏర్పాటు

ఈ నెట్‌వర్క్‌లో 38,000కు పైగా ఆసుపత్రులు భాగం



కేంద్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న ఆయుష్మాన్ భారత్ పథకం విజయవంతంగా ఎనిమిదేళ్లు పూర్తి చేసుకుంది. ఈ సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ బుధవారం స్పందిస్తూ.. ప్రతి భారతీయుడికి నాణ్యమైన, అందుబాటు ధరలో వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో ఈ పథకాన్ని ప్రారంభించినట్లు గుర్తు చేశారు. ఈ పథకం ఇప్పుడు ప్రపంచంలోనే అతిపెద్ద ఆరోగ్య సంరక్షణ కార్యక్రమంగా నిలిచిందని ఆయన కొనియాడారు.

ఈ విషయంపై ప్రధాని మోదీ సోషల్ మీడియా 'ఎక్స్'లో ఒక పోస్ట్ చేశారు. "ఎనిమిదేళ్ల క్రితం, ప్రతి భారతీయుడికి అత్యుత్తమ, అందుబాటు ధరలో వైద్యం అందాలనే ఆలోచనతో ఆయుష్మాన్ భారత్ ప్రారంభమైంది. ఈ రోజు, 60కోట్లకు పైగా లబ్ధిదారులకు ఏటా రూ.5లక్షల ఆరోగ్య కవరేజీ అందుబాటులో ఉంది. ఇది ప్రపంచంలోనే అతిపెద్ద ఆరోగ్య పథకం" అని ఆయన పేర్కొన్నారు. ఈ పథకం వల్ల పేద, మధ్యతరగతి ప్రజలకు వైద్య ఖర్చులు రికార్డు స్థాయిలో ఆదా అవుతున్నాయని ప్రధాని తెలిపారు. అంతేగాక ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌ల ద్వారా వైద్య సేవలు ప్రజల ముంగిటకే చేరుతున్నాయని, ఇప్పటికే ఈ కేంద్రాల్లో 500కోట్లకు పైగా సందర్శనలు నమోద య్యాయని ప్రధాని వివరించారు. ఈ పథకం ద్వారా గ్రామీణ స్థాయిలో ప్రాథమిక ఆరోగ్య సంరక్షణ బలపడుతోందని ఆయన అన్నారు.

**విజయాలను వివరించిన MyGovIndia**

ఆయుష్మాన్ భారత్ ఎనిమిదేళ్ల ప్రస్థానంలో సాధించిన విజయాలను MyGovIndia కూడా తన పోస్టులో వివరించింది. ఆయుష్మాన్ భారత్ ప్రధాన మంత్రి జన్ ఆరోగ్య యోజన (పీఎం–జేఏవై) కింద అందించిన ఉచిత చికిత్సల వల్ల కుటుంబాలకు రూ. 2 లక్షల కోట్లకు పైగా వైద్య ఖర్చులు ఆదా అయ్యాయని తెలిపింది. దేశవ్యాప్తంగా 38,000కు పైగా ఆసుపత్రులు ఈ నెట్‌వర్క్‌లో భాగమయ్యాయని, ఇప్పటివరకు 13 కోట్లకు పైగా హాస్పిటల్ అడ్మిషన్లు జరిగాయని పేర్కొంది.

70 ఏళ్లు పైబడిన ఆరు కోట్ల మంది సీనియర్ సిటిజన్లను వారి సామాజిక, ఆర్థిక స్థితితో సంబంధం లేకుండా ఈ పథకం పరిధిలోకి తీసుకువచ్చారు. మొత్తం ఆయుష్మాన్ కార్డుల్లో దాదాపు సగం మహిళల పేరు మీద ఉండటం గమనార్హం. ప్రాథమిక ఆరోగ్య సంరక్షణను ప్రజలకు మరింత చేరువ చేసేందుకు దేశవ్యాప్తంగా 1.86 లక్షల ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌లు పనిచేస్తున్నాయి. ఈ కేంద్రాల ద్వారా మధుమేహం, రక్తపోటు కోసం 42 కోట్లకు పైగా స్క్రీనింగ్‌లు, అలాగే నోటి, రొమ్ము, గర్భాశయ క్యాన్సర్ల కోసం కోట్ల సంఖ్యలో పరీక్షలు నిర్వహించారు.

ఈ పథకం పోర్టబిలిటీ సదుపాయం ద్వారా లబ్ధిదారులు తమ సొంత రాష్ట్రం వెలుపల కూడా రూ. 8,800 కోట్లకు పైగా విలువైన 30 లక్షలకు పైగా చికిత్సలు పొందారని MyGovIndia వెల్లడించింది. మొత్తంగా, 60 కోట్ల మందికి రూ. 5 లక్షల ఆరోగ్య బీమా అందిస్తూ, తీవ్రమైన అనారోగ్య పరిస్థితుల్లో ఈ పథకం ఆర్థిక భద్రతను కల్పిస్తోంది.

# అక్టోబరు 2న యూపీఐ చెల్లింపులు బంద్

యూపీఐ చెల్లింపులపై ఎండీఆర్ ఛార్జీలకు వ్యతిరేకంగా వ్యాపారుల నిరసన

అక్టోబర్ 2న 'నో యూపీఐ డే' పాటించాలని వ్యాపార సంఘాల పిలుపు

రూ.2,000 దాటిన లావాదేవీలపై 0.4 శాతం రుసుమును విధించనున్న ప్రభుత్వం

కొత్త నిబంధనలు వెనక్కి తీసుకోకపోతే ఆందోళన ఉద్ధృతం చేస్తామని హెచ్చరిక



దేశంలో డిజిటల్ చెల్లింపుల వ్యవస్థలో కీలకమైన యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ (యూపీఐ) ద్వారా జరిపే కొన్ని లావాదేవీలపై ఛార్జీలు విధించాలన్న ప్రభుత్వ నిర్ణయంపై వ్యాపార వర్గాలు భగ్గుమన్నాయి. ఈ కొత్త నిబంధనలకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా అక్టోబర్ 2 (గాంధీ జయంతి) నాడు "నో యూపీఐ డే" పాటించాలని పలు వాణిజ్య, వ్యాపార సంఘాలు పిలుపునిచ్చాయి. ఆ రోజున తమ దుకాణాల్లోని యూపీఐ క్యూఆర్ కోడ్‌లు, స్కానర్లు, సౌండ్ బాక్సులను నల్లటి వస్త్రంతో కప్పివేసి నిరసన తెలపాలని నిర్ణయించాయి.

**అక్టోబర్ 15 నుంచి అమల్లోకి కొత్త నిబంధనలు**

అక్టోబర్ 15 నుంచి యూపీఐ చెల్లింపులకు సంబంధించి కొత్త నిబంధనలు అమల్లోకి రానున్నాయి. దీని ప్రకారం, వ్యాపారులు (P2M – పర్సన్ టు మర్చంట్) స్వీకరించే రూ.2,000కు పైబడిన ప్రతి యూపీఐ లావాదేవీపై 0.4 శాతం మర్చంట్ డిస్కౌంట్ రేట్ (MDR) చెల్లించాల్సి ఉంటుంది. అయితే, ఒక లావాదేవీపై గరిష్ఠంగా రూ.300 మాత్రమే ఛార్జ్ చేస్తారు.

అయితే, వ్యక్తుల మధ్య జరిగే (P2P – పర్సన్ టు పర్సన్) యూపీఐ లావాదేవీలపై ఎలాంటి ఛార్జీలు ఉండవు. అలాగే, నెలకు రూ.1 లక్ష వరకు యూపీఐ ద్వారా చెల్లింపులు స్వీకరించే చిన్న వ్యాపారులకు (P2PM) కూడా ఈ ఎండీఆర్ నుంచి మినహాయింపు ఇచ్చారు. 2026 ఆగస్టు నెలలోనే వ్యాపారులకు రూ.8.95 ట్రిలియన్ల విలువైన 15.51 బిలియన్ల లావాదేవీలు జరగ్గా, అందులో రూ.2,000కు పైబడిన చెల్లింపుల వాటానే సుమారు 67 శాతం ఉండటం గమనార్హం.

**వ్యాపారుల ఆందోళన ఎందుకు?**

తమకు ఇప్పటికే చాలా తక్కువ లాభాలు వస్తుండగా, ఇప్పుడు యూపీఐపై కొత్త ఛార్జీలు విధించడం వల్ల ఆర్థికంగా మరింత భారం పడుతుందని వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. డిజిటల్ ఇండియాను ప్రోత్సహించి, పారదర్శక లావాదేవీలు జరుపుతున్న తమను ప్రోత్సహించాల్సింది పోయి, ఇలా ఛార్జీలతో శిక్షించడం సరికాదని వారు వాదిస్తున్నారు. మహారాష్ట్ర ఛాంబర్ ఆఫ్ కామర్స్ (MACCIA), ఆల్ ఇండియా కన్స్యూమర్ ప్రొడక్ట్స్ డిస్ట్రిబ్యూటర్స్ ఫెడరేషన్ (AICPDF) వంటి అనేక జాతీయ స్థాయి సంఘాలు ఈ నిరసనకు మద్దతు ప్రకటించాయి.

ఈ అంశంపై పెట్రోలియం డీలర్లు, స్టాక్ బ్రోకర్లు కూడా తమకు మినహాయింపులు ఇవ్వాలని కోరుతున్నారు. ఇప్పటికే పెట్రోలియం మంత్రిత్వ శాఖ డీలర్లతో చర్చలు జరపగా, క్యాపిటల్ మార్కెట్ లావాదేవీలపై విధించిన 0.02 శాతం ఎండీఆర్‌పై బ్రోకర్ల ఆందోళనలను పరిశీలిస్తామని సెబీ హామీ ఇచ్చింది. అక్టోబర్ 15 లోగా ప్రభుత్వం ఈ ఛార్జీలను ఉపసంహరించుకోకపోతే తమ నిరసనను మరింత ఉద్ధృతం చేస్తామని వ్యాపార సంఘాలు హెచ్చరించాయి.

# పనీర్ పేరుతో మోసం ఇక కుదరదు.. దేశవ్యాప్తంగా నిషేధానికి ఎఫ్‌ఎస్‌ఎస్‌ఏఐ ప్రతిపాదన

అనలాగ్ పనీర్‌పై దేశవ్యాప్తంగా నిషేధానికి ప్రతిపాదన – ఎఫ్ఎస్ఎస్ఏఐ ముసాయిదా నిబంధనలు విడుదల

పనీర్ పేరుతో వినియోగదారులను తప్పుదోవ పట్టించకుండా చర్య – 'అనలాగ్' ఉత్పత్తులకు పనీర్ పేరు తొలగింపు

ముసాయిదాపై 60 రోజుల పాటు అభిప్రాయాల స్వీకరణ



పనీర్ పేరుతో విక్రయిస్తున్న నాన్–డెయిరీ ఉత్పత్తులపై కేంద్రం కీలక చర్యలకు సిద్ధమవుతోంది. దేశవ్యాప్తంగా అనలాగ్ పనీర్ తయారీ, విక్రయాలను నిషేధించేలా ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఎఫ్ఎస్–ఎస్ఏఐ) ప్రతిపాదించింది. ఇందుకు సంబంధించిన ముసాయిదా నిబంధనలను ప్రజల అభిప్రాయాల కోసం విడుదల చేసింది. ఎఫ్ఎస్ఎస్ఏఐ ముసాయిదా ప్రకారం.. పనీర్ స్వభావం, అందులో ఉపయోగించిన పదార్థాల విషయంలో వినియోగదారులు తప్పుదోవ పట్టకుండా ఈ మార్పులు తీసుకొస్తున్నారు. ప్రస్తుతం 'అనలాగ్ ఇన్ డెయిరీ కాంటెక్స్ట్' కేటగిరీలో లైసెన్స్ లేదా రిజిస్ట్రేషన్ పొందిన ఉత్పత్తులు ఇకపై తమ పేరు, లేబుల్, మార్కెటింగ్‌లో 'పనీర్' అనే పదాన్ని ఉపయోగించకూడదు. ఈ నిబంధనలను ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ (ప్రొహిబిషన్ అండ్ రెస్ట్రిక్షన్స్ ఆన్ సేల్స్) రెగ్యులేషన్స్‌లో చేర్చాలని ఎఫ్ఎస్ఎస్ఏఐ నిర్ణయించింది. ముసాయిదాపై అభిప్రాయాలను 60 రోజుల వ్యవధిలో స్వీకరించనున్నారు. ఇప్పటికే పలు రాష్ట్రాలు అనలాగ్ పనీర్ తయారీ, విక్రయాలపై నిషేధం విధించాయి. మహారాష్ట్రలో ఇటీవల ఆర్టిఫిషియల్ అనలాగ్ పనీర్ తయారీ, పంపిణీ, విక్రయాలపై ఏడాది పాటు నిషేధం విధించారు. రాష్ట్రంలో ఇటీవల పరీక్షించిన పనీర్ నమూనాల్లో 35 శాతానికి పైగా నాణ్యత పరీక్షల్లో విఫలమయ్యాయి. కూరగాయల కొవ్వు కల్తీ ఉన్నట్లు పరీక్షల్లో తేలడంతో ఈ చర్య తీసుకున్నారు. గుజరాత్ ప్రభుత్వం కూడా నాన్–స్టాండర్డ్ అనలాగ్ పనీర్, చీజ్, వెన్న తయారీ, నిల్వ, రవాణా, పంపిణీ, విక్రయాలపై రాష్ట్రవ్యాప్తంగా నిషేధం ప్రకటించింది. కూరగాయల నూనెతో పాటు ఇతర డెయిరీయేతర పదార్థాలతో తయారు చేసిన ఉత్పత్తులను పనీర్‌గా విక్రయించడం వల్ల వినియోగదారులు మోసపోయే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. దీనివల్ల అసలైన పాల ఉత్పత్తుల తయారీదారులకు నష్టం కలగడంతో పాటు ఆహార భద్రతపై ఆందోళనలు పెరుగుతున్నాయి.

# రెస్టారెంట్‌లో ఈ 5 పనులు అస్సలు చేయొద్దు.. ఈ చిన్న పొరపాట్లు ఇతరులకు చికాకు తెప్పించవచ్చు!



సిబ్బంది పట్ల దురుసుగా ప్రవర్తించడం సరికాదు

ఫోన్‌ను స్పీకర్ ఆన్ చేసి మాట్లాడటం, వీడియోలు చూడటం మానుకోవాలి

పిల్లలను టేబుళ్ల మధ్యలో పరిగెత్తకుండా చూసుకోవాలి

ఇతరులు వేచి చూస్తున్నప్పుడు భోజనం తర్వాత ఎక్కువసేపు కూర్చోవద్దు

పక్క టేబుల్ మీదుగా వస్తువులు తీసుకోవడానికి ప్రయత్నించవద్దు

ప్రస్తుత జీవనశైలిలో బయట తినడం అనేది ఒక సాధారణ అలవాటుగా మారిపోయింది. కుటుంబంతోనో, స్నేహితులతోనో రెస్టారెంట్‌కు వెళ్లి భోజనం చేయడం ఒకచక్కటి అనుభూతిని ఇస్తుంది. అయితే, రెస్టారెంట్ అనేది కేవలం మనం మాత్రమే ఉండే ప్రదేశం కాదు. అది ఎంతో మంది కలిసి పంచుకునే ఒక పబ్లిక్ స్పేస్. టైమ్స్ ఆఫ్ ఇండియా కథనం ప్రకారం.. ఇలాంటి చోట మనం చేసే చిన్న చిన్న పనులు కూడా ఇతరుల ఆనందాన్ని, సిబ్బంది పనితీరును ప్రభావితం చేస్తాయి. అందుకే, రెస్టారెంట్‌కు వెళ్లినప్పుడు కొన్ని కనీస మర్యాదలు పాటించడం చాలా అవసరం. దీనివల్ల మనకు, ఇతరులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా భోజనం ప్రశాంతంగా ముగుస్తుంది. మరి రెస్టారెంట్‌లో సాధారణంగా చేయకూడని కొన్ని ముఖ్యమైన పనులేంటో చూద్దాం.

**1. సిబ్బందితో దురుసుగా ప్రవర్తించడం**

రెస్టారెంట్‌లో సర్వీస్ ఆలస్యమైనా లేదా ఆర్డర్ చేసిన ఆహారంలో ఏదైనా తేడా వచ్చినా చిరాకు రావడం సహజం. కానీ, ఆ కోపాన్ని సర్వర్లపై చూపించడం సరికాదు. చేతులు తిప్పుతూ పిలవడం, గట్టిగా అరవడం, అవమానకరంగా మాట్లాడటం వంటివి వారిని మానసికంగా దెబ్బతీస్తాయి. ఏదైనా సమస్య ఉంటే.. ప్రశాంతంగా వారిని పిలిచి వివరించాలి. తద్వారా సమస్య సులభంగా పరిష్కారమవుతుంది. సిబ్బంది కూడా రోజంతా ఎంతో ఒత్తిడిలో పనిచేస్తుంటారనే విషయాన్ని గుర్తుంచుకోవాలి.

**2. ఫోన్‌ను స్పీకర్‌పై ఉపయోగించడం**

మనకు ఇష్టమైన పాటలు వినడానికి, వీడియోలు చూడటానికి లేదా ఫోన్‌లో గట్టిగా మాట్లాడటానికి రెస్టారెంట్ సరైన చోటు కాదు. ఫోన్‌ను స్పీకర్ ఆన్ చేసి మాట్లాడటం లేదా వీడియోలు ప్లే చేయడం వల్ల పక్క టేబుళ్లలో ఉన్నవారికి తీవ్రమైన అసౌకర్యం కలుగుతుంది. వారి సంభాషణలకు, ప్రశాంతతకు భంగం కలిగించిన వాళ్లమవుతాం. తప్పనిసరిగా మాట్లాడాల్సి వస్తే, నెమ్మదిగా మాట్లాడాలి లేదా బయటకు వెళ్లి సంభాషణ ముగించాలి. వీడియో చూడాల్సి వస్తే హెడ్‌ఫోన్స్ వాడటం ఉత్తమమైన పద్ధతి.

**3. పిల్లలను స్వేచ్ఛగా వదిలేయడం**

పిల్లలతో రెస్టారెంట్‌కు వెళ్లడం ఒక సవాలే. అయితే, వారిని టేబుళ్ల మధ్యలో పరిగెత్తడానికి, ఆడుకోవడానికి అనుమతించడం ప్రమాదకరం. రెస్టారెంట్లు ఎప్పుడూ వేడి ఆహారం, గాజు సామగ్రితో నిండి ఉంటాయి. సర్వర్లు వేగంగా తిరుగుతూ ఉంటారు. ఇలాంటి సమయంలో పిల్లలు అటుఇటు పరిగెడితే, వేడి పదార్థాలు వారిపై పడే ప్రమాదం ఉంది. అంతేగాక ఇతరులకు ఇబ్బందిగా కూడా ఉంటుంది. అందుకే, పిల్లలను మన టేబుల్ వద్దే ఉండేలా చూసుకోవడం తల్లిదండ్రుల బాధ్యత.

**4. పక్క టేబుల్ మీదుగా వస్తువులు అందుకోవడం**

కొన్నిసార్లు మన టేబుల్‌పై లేని ఉప్పు, సాస్ వంటివి పక్క టేబుల్‌పై కనిపిస్తాయి. అంతమాత్రాన అపరిచితుల టేబుల్ మీదుగా చేయి చాపి వాటిని తీసుకోవడానికి ప్రయత్నించకూడదు. ఇది వారి వ్యక్తిగత ప్రదేశంలోకి చొరబడినట్లు అవుతుంది. దానికి బదులుగా, మర్యాదగా వారిని అడిగినా లేదా అక్కడి సిబ్బంది సహాయం తీసుకున్నా పని సులభంగా పూర్తవుతుంది.

**5. రద్దీగా ఉన్నప్పుడు ఎక్కువసేపు కూర్చోవడం**

రెస్టారెంట్ ఖాళీగా ఉన్నప్పుడు భోజనం తర్వాత కాసేపు స్నేహితులతో కబుర్లు చెప్పుకుంటూ కూర్చోవడంలో తప్పులేదు. కానీ, రెస్టారెంట్ బాగా రద్దీగా ఉండి, బయట కస్టమర్లు వేచి చూస్తున్నప్పుడు మనం త్వరగా టేబుల్ ఖాళీ చేయడం ఎంతో అవసరం. మన భోజనం, బిల్ చెల్లింపు పూర్తయ్యాక కూడా గంటల తరబడి అక్కడే కూర్చోవడం వల్ల వ్యాపారానికి నష్టం కలగడమే కాకుండా, ఎదురుచూస్తున్న వారికి అసౌకర్యం కలుగుతుంది. పరిస్థితిని అర్థం చేసుకుని నడుచుకోవడం అందరికీ మంచిది. ఈ నియమాలేవీ కఠినమైనవి కావు. కేవలం తోటివారి పట్ల, సిబ్బంది పట్ల మనం చూపించే చిన్నపాటి గౌరవం, బాధ్యత. ఇవి పాటిస్తే అందరి భోజన అనుభవం ఆనందదాయకంగా మారుతుంది.

# అంబటి రాంబాబుకు ఈడీ నోటీసులు..

నేడు విచారణకు రావాలని ఆదేశం

లిక్కర్ రవాణా కుంభకోణం కేసులో అంబటికి ఈడీ నోటీసులు

శుక్రవారం ఉదయం 10.30 గంటలకు హైదరాబాద్‌లోని ఈడీ కార్యాలయానికి రావాలని ఆదేశం

15 రోజుల క్రితమే స్టంట్లు వేయించుకున్నానన్న అంబటి



అమరావతి సింధూరదర్శిని: ఆంధ్రప్రదేశ్ మద్యం రవాణా కుంభకోణం కేసులో వైసీపీ సీనియర్ నేత, మాజీ మంత్రి అంబటి రాంబాబుకు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) నోటీసులు జారీ చేసింది. రేపు ఉదయం 10.30 గంటలకు హైదరాబాద్‌లోని ఈడీ కార్యాలయంలో విచారణకు హాజరు కావాలని ఫోన్ ద్వారా సమాచారం అందించారు. అయితే అంబటి రాంబాబు తన ఆరోగ్య పరిస్థితిని వివరిస్తూ స్పందించారు. 15 రోజుల క్రితం గుండెకు స్టంట్‌లు వేయించుకున్నానని, డాక్టర్ల సలహా మేరకు ప్రస్తుతం కోలుకుంటున్నానని తెలిపారు. పూర్తిగా కోలుకున్న తర్వాత ముందుగా సమాచారం ఇచ్చి విచారణకు వస్తానని, తప్పనిసరిగా సహకరిస్తానని మెసేజ్ పంపారు. ఆయన సమాధానంపై ఈడీ అధికారులు ఇంకా స్పందించాల్సి ఉంది. ఇదే కేసులో ఈరోజు మర్రి సుబ్బారెడ్డి, పురుషోత్తమరావుల వాంగ్మూలాలను ఈడీ నమోదు చేసుకుంది. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ప్రభుత్వ మద్యం దుకాణాలకు లిక్కర్ రవాణా కోసం సిగ్మా, ప్రసాద్ ట్రాన్స్‌పోర్ట్ సంస్థలకు కాంట్రాక్టులు కట్టబెట్టినట్లు గుర్తించారు. మొదటి కాంట్రాక్టు కాలంలో వీరిద్దరూ కలిసి సుమారు 59.14 లక్షల మద్యం పెట్టెలు రవాణా చేశారని అధికారులు ప్రశ్నించారు. సిగ్మా సంస్థ నుంచి రూ.15.44 కోట్లు అందుకున్నట్లు విచారణలో వెల్లడైంది. సబ్‌కాంట్రాక్టులు, నిధుల మళ్లింపు, అంబటి రాంబాబుతో ఉన్న సంబంధాలపై కూడా వివరాలు అడిగారు. ట్రాన్స్‌పోర్ట్ ఛార్జీలను అధికంగా పెంచడం వల్ల ప్రభుత్వ ఖజానాకు రూ.195 కోట్లకు పైగా నష్టం వాటిల్లినట్లు ఈడీ లెక్కలు చూపిస్తోంది.

# రోహిత్‌తో నా బంధం ప్రత్యేకం.. పనిచేసిన కెప్టెన్లందరిదీ ఒకే మాట: గౌతమ్ గంభీర్

**రోహిత్‌తో తనది కేవలం కెప్టెన్-కోచ్ బంధం కాదన్న గంభీర్ – తమ ఇద్దరి ఆలోచనా విధానాలు ఒకరికొకరికి తెలుసని వ్యాఖ్య**

**తాను పనిచేసిన నలుగురు కెప్టెన్లదీ 'జట్టుకే తొలి ప్రాధాన్యం' అనే వైఖరి అన్న గౌతీ**

**శ్రేయస్‌లో నాయకత్వ లక్షణాలను ఎప్పుడో గుర్తించానన్న గంభీర్ – టెస్టు కెప్టెన్సీని శుభ్‌మన్ గిల్ అద్భుతంగా నిర్వర్తించాడని ప్రశంస**

టీమిండియా హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్.. సీనియర్ ఆటగాడు, మాజీ కెప్టెన్ రోహిత్ శర్మతో తనకున్న బంధంపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. తమ మధ్య ఉన్నది కేవలం కెప్టెన్-కోచ్ సంబంధం మాత్రమే కాదని, అంతకు మించిన బలమైన అవగాహన ఉందని స్పష్టం చేశాడు. ఆదివారం నుంచి తిరువనంతపురంలో వెస్టిండీస్‌తో ప్రారంభం కానున్న వన్డే సిరీస్ నేపథ్యంలో గంభీర్ జియోస్టార్‌తో మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశాడు. "రోహిత్‌తో నా బంధం ఈనాటిది కాదు. అతను జట్టులోకి వచ్చినప్పుడు నేను సీనియర్ ఆటగాడిని. అప్పటి నుంచే మా మధ్య మంచి సంబంధం ఉంది. ఒకరి ఆలోచనా విధానం మరొకరికి బాగా తెలుసు. ఇది మైదానంలో మా పనిని చాలా సులువు చేస్తుంది. కొన్నిసార్లు నా ఆలోచన, కెప్టెన్ ఆలోచన వేర్వేరుగా ఉండొచ్చు. కానీ, అంతిమంగా జట్టు ప్రయోజనాలే ముఖ్యమని ఇద్దరం నమ్ముతాం. అదే జరిగితే అంతకంటే మంచి విషయం మరొకటి ఉండదు" అని గంభీర్ వివరించాడు.



2024 జులైలో తాను హెడ్ కోచ్‌గా బాధ్యతలు స్వీకరించినప్పటి నుంచి పనిచేసిన నలుగురు కెప్టెన్లను గంభీర్ ప్రశంసించాడు. "నేను రోహిత్, సూర్యకుమార్ యాదవ్, శ్రేయస్ అయ్యర్, శుభ్‌మన్ గిల్‌తో కలిసి పనిచేశాను. ఈ నలుగురిలో నేను గమనించిన ముఖ్యమైన విషయం 'జట్టుకే తొలి ప్రాధాన్యం' ఇవ్వడం. తమకంటే జట్టు ప్రయోజనాలే ముఖ్యమని భావించే కెప్టెన్లతో పనిచేయడం నా అదృష్టం" అని అన్నాడు.

కెప్టెన్ల గురించి గౌతీ విడివిడిగా మాట్లాడుతూ.. "శ్రేయస్‌లో నాయకత్వ లక్షణాలను నేను 2018లోనే గుర్తించాను. అప్పుడు ఢిల్లీ కెప్టెన్సీని అతనికి అప్పగించాను. ఇప్పుడు మళ్లీ అతనితో పనిచేసే అవకాశం వచ్చింది. ఇక, శుభ్‌మన్ గిల్ చాలా యువకుడు. ఇంగ్లండ్ లాంటి కఠినమైన పర్యటనలో ఐదు టెస్టులకు కెప్టెన్సీ ఇవ్వడమంటే, ఒకరిని లోతైన సముద్రంలోకి తోసేయడం లాంటిది. కానీ, గిల్ ఆ సవాలును అద్భుతంగా స్వీకరించి, ఈత కొట్టి బయటపడ్డాడు. రాబోయే సంవత్సరాల్లో అతనిలో అత్యుత్తమ ఆటను మనం చూస్తాం" అని గంభీర్ విశ్వాసం వ్యక్తం చేశాడు. ఆలోచనలు, వ్యూహాలు మారొచ్చుని, కానీ జట్టు పట్ల కెప్టెన్ల ఉద్దేశం సరిగ్గా ఉన్నంత కాలం సహాయక సిబ్బందికి పని సులువు అవుతుందని పేర్కొన్నాడు.

# తొలిరోజు 1.8 శాతం లాభం.. రూ.1,818 వద్ద ముగిసిన ఎన్ఎస్ఈ షేరు

**భారీ అంచనాల మధ్య నేడు మార్కెట్లలో లిస్ట్ అయిన ఎన్ఎస్ఈ షేర్లు**

**0.8 శాతం లాభంతో బీఎస్ఈలో రూ.1,800 వద్ద లిస్టయిన షేర్లు**

**ఇంట్రాడేలో ఓ దశలో ఐదు శాతం లాభపడిన వైనం – చివరకు 1.8 శాతం లాభంతో రూ.1,818 వద్ద ముగింపు**

**రూ.1,700-1,785 ధరల శ్రేణితో ఐపీఓకి వచ్చిన ఎన్ఎస్ఈ**

భారీ అంచనాలతో వచ్చిన 'నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్' (ఎన్ఎస్ఈ) ఐపీఓ తర్వాత షేర్లు స్టాక్ మార్కెట్లో స్వల్ప లాభంతో ముగిశాయి. రూ. 1,785 ఇష్యూ ధరగా ఉన్న షేర్లు గురువారం రూ. 1,818 వద్ద ముగిశాయి. అంటే ఇష్యూ ధరతో పోలిస్తే 1.8 శాతం లాభం నమోదైంది. ఇంట్రాడేలో ఓ దశలో షేరు 5శాతానికి పైగా ఎగబాకింది. ఎన్ఎస్ఈ షేర్లు బీఎస్ఈలో రూ. 1,800 వద్ద లిస్టయ్యాయి. ఇష్యూ ధరతో పోలిస్తే ఇది 0.8 శాతం ప్రీమియం. అయితే గ్రే మార్కెట్‌లో ఊహించిన స్థాయిలో లాభం రాలేదు. లిస్టింగ్ సమయానికి ఎన్ఎస్ఈ మార్కెట్ విలువ సుమారు రూ. 4.45 లక్షల కోట్లుగా నమోదైంది. పెట్టుబడిదారులకు మరింత సౌకర్యంగా ఉండేలా మొబైల్ ఆధారిత సమగ్ర ప్లాట్‌ఫామ్‌పై ఎన్ఎస్ఈ పనిచేస్తోందని సంస్థ ఎండీ, సీఈవో ఆశిష్‌కుమార్ చౌహాన్ తెలిపారు. ఇందులో ట్రేడింగ్ డేటా, పోర్ట్‌ఫోలియో వివరాలు, విశ్లేషణలను ఒకే చోట అందించేలా వ్యవస్థను రూపొందిస్తున్నట్లు చెప్పారు. దేశ ఆర్థిక వ్యవస్థలో క్యాపిటల్ మార్కెట్లు కీలక పాత్ర పోషిస్తున్నాయని పేర్కొన్నారు.




ఎన్ఎస్ఈ ఐపీఓ సెప్టెంబర్ 17 నుంచి 21 వరకు జరిగింది. 5.71రెట్లు సబ్‌స్క్రైబ్ అయింది. రూ. 22,568.94 కోట్ల ఇష్యూ పరిమాణానికి రూ. 90,287.33 కోట్ల విలువైన బిడ్లు వచ్చాయి. ఒక్కో షేరుకు రూ. 1,700-1,785 ధరల శ్రేణిని నిర్ణయించారు. ఈ ఐపీఓ పూర్తిగా ఆఫర్ ఫర్ సేల్ (ఓఎఫ్ఎస్) రూపంలో జరిగింది. ఇప్పటికే ఉన్న వాటాదారులు 12.64 కోట్ల షేర్లను విక్రయించారు.

2024లో వచ్చిన రూ. 27,870 కోట్ల హ్యుందాయ్ మోటార్ ఇండియా ఐపీఓ తర్వాత దేశంలో ఇదే రెండో అతిపెద్ద పబ్లిక్ ఇష్యూ. ఎన్ఎస్ఈ ఆదాయంలో ట్రేడింగ్ ఛార్జీల వాటా భారీగా ఉంది. 2026 ఆర్థిక సంవత్సరంలో నిర్వహణ ఆదాయంలో 78.65 శాతం లావాదేవీల ఛార్జీల నుంచే వచ్చింది. ఇందులో ఆప్షన్స్ ట్రేడింగ్ ఒక్కటే 60 శాతానికి పైగా ఆదాయాన్ని అందించింది.

# అంటార్కిటికాలో మంచు గణపతి.. భారత శాస్త్రవేత్తల వినూత్న చవితి వేడుక.. వీడియో వైరల్!

**మైత్రి పరిశోధన కేంద్రంలో ఘనంగా వినాయక చవితి వేడుకలు – పర్యావరణ హితంగా బకెట్ నీటిలో విగ్రహ నిమజ్జనం**

**ఈ వేడుకలకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ – కఠిన పరిస్థితుల్లోనూ సంప్రదాయాన్ని పాటించిన శాస్త్రవేత్తలపై ప్రశంసలు**





స్వదేశానికి వేల కిలోమీటర్ల దూరంలో, అత్యంత శీతల ఖండమైన అంటార్కిటికాలో భారత శాస్త్రవేత్తలు వినాయక చవితి పండుగను ఎంతో భక్తిశ్రద్ధలతో, వినూత్నంగా జరుపుకున్నారు. అక్కడి భారత పరిశోధన కేంద్రమైన 'మైత్రి'లో పనిచేస్తున్న శాస్త్రవేత్తల బృందం, మంచుతోనే గణనాథుడి విగ్రహాన్ని స్వయంగా తయారు చేసి, ప్రత్యేక పూజలు నిర్వహించి తమ సంప్రదాయంపట్ల ఉన్న గౌరవాన్ని చాటుకున్నారు. ఈ అపురూప వేడుక ఇప్పుడు సోషల్ మీడియాలో అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. 'నేషనల్ సెంటర్ ఫర్ పోలార్ అండ్ ఓషన్ రీసెర్చ్' (ఎన్‌సీపీఓఆర్)కు చెందిన ఈ పరిశోధకులు, గడ్డకట్టే చలిలో తమకు అందుబాటులో ఉన్న మంచును ఉపయోగించి ఒక సుందరమైన గణపతి రూపాన్ని తీర్చిదిద్దారు. ఎలాంటి అచ్చులు లేకుండా, కేవలం చేతులతోనే ఈ విగ్రహాన్ని రూపొందించడం వారి సృజనాత్మకతకు, భక్తికి నిదర్శనంగా నిలిచింది. అనంతరం హిందూ సంప్రదాయం ప్రకారం విగ్రహానికి హారతి ఇచ్చి, పూజలు చేశారు. నైవేద్యంగా మోదకాలు వంటి ప్రసాదాలను సమర్పించి పండుగ వాతావరణాన్ని సృష్టించారు. ఈ వేడుకలో అత్యంత ప్రత్యేకమైన ఘట్టం నిమజ్జనం. అంటార్కిటికాలోని సున్నితమైన, కాలుష్యరహిత పర్యావరణానికి ఎలాంటి హాని కలగకూడదనే గొప్ప ఉద్దేశంతో వారు పర్యావరణ హితమైన పద్ధతిని ఎంచుకున్నారు. బయట సహజ నీటి వనరులలో కాకుండా, పరిశోధన కేంద్రం లోపలే ఒక బకెట్‌లో నీటిని తీసుకుని, అందులో మంచు గణపతి విగ్రహాన్ని ఉంచారు. కొద్దిసేపటికే మంచు పూర్తిగా కరిగి విగ్రహం నీటిలో కలిసిపోయింది. ఈ విధంగా వారు పర్యావరణ నిబంధనలను పాటిస్తూనే తమ సాంప్రదాయాన్ని పూర్తిచేశారు.

ఈ బృందంలోని డాక్టర్ అనిరుధ్ ధర్, ఈ అపురూప వేడుకలకు సంబంధించిన వీడియోను తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో పంచుకున్నారు. "మా ఇంటికి 15,000 కిలోమీటర్ల దూరంలో, సుస్థిరమైన పద్ధతిలో నిమజ్జనం" అంటూ ఆయన తన పోస్టుకు క్యాప్షన్ జోడించారు. ఈ వీడియో సోషల్ మీడియాలో వేగంగా వైరల్ అయింది. అత్యంత కఠినమైన వాతావరణ పరిస్థితుల్లోనూ, తమ సంస్కృతిని మరువకుండా ఇంత సృజనాత్మకంగా, భక్తితో పండుగ జరుపుకున్న శాస్త్రవేత్తల బృందంపై నెటిజన్లు ప్రశంసల వర్షం కురిపిస్తున్నారు. వారి దేశభక్తిని, పర్యావరణ స్పృహను కొనియాడుతున్నారు.




# బెంగాల్‌పై గౌతమ్ అదానీ వరాల జల్లు..

**లక్ష కోట్ల రూపాయల భారీ పెట్టుబడులు**

**2035 నాటికి వివిధ రంగాల్లో ఈ పెట్టుబడులు పెట్టనున్నట్టు అదానీ వెల్లడి**

**కోల్‌కతా సమీపంలో రూ.4,000కోట్లతో 'అదానీ ఆరోగ్య మందిర్' ఆసుపత్రికి శంకుస్థాపన**

**ఆసుపత్రిలో 50% పడకలు పేదలకు కేటాయించి ఉచిత వైద్యం అందిస్తామని హామీ**

**బెంగాల్‌ను తమ కర్మభూమిగా భావిస్తున్నట్టు అదానీ వ్యాఖ్య**

ప్రముఖ పారిశ్రామిక దిగ్గజం అదానీ గ్రూప్ పశ్చిమ బెంగాల్ రాష్ట్రంలో భారీ పెట్టుబడులు పెట్టేందుకు ముందుకొచ్చింది. 2035 నాటికి రాష్ట్రంలో లక్ష కోట్ల రూపాయలకు పైగా పెట్టుబడులు పెట్టనున్నట్టు అదానీ గ్రూప్ ఛైర్మన్ గౌతమ్ అదానీ గురువారం ప్రకటించారు. ప్రధానంగా మౌలిక వసతుల కల్పనే లక్ష్యంగా ఈ పెట్టుబడులు ఉంటాయని ఆయన స్పష్టం చేశారు. కోల్‌కతా సమీపంలోని న్యూ టౌన్‌లో 2,000 పడకల సామర్థ్యంతో నిర్మించ తలపెట్టిన 'అదానీ ఆరోగ్య మందిర్' ఆసుపత్రి శంకుస్థాపన కార్యక్రమంలో గౌతమ్ అదానీ ఈ కీలక ప్రకటన చేశారు. ఈ కార్యక్రమానికి పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి సువేందు అధికారి హాజరయ్యారు. రాష్ట్రంలో అదానీ గ్రూప్ పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు రావడంపై ఆయన హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా గౌతమ్ అదానీ మాట్లాడుతూ.. పశ్చిమ బెంగాల్‌ను తూర్పు భారతదేశంలో తమ 'కర్మభూమి'గా అభివర్ణించారు. ఈ రాష్ట్రాన్ని కేవలం ఒక పెట్టుబడి కేంద్రంగానే కాకుండా, తాము సేవ చేయాలనుకుంటున్న, భాగం కావాలనుకుంటున్న ప్రదేశంగా చూస్తున్నామని అన్నారు. పోర్టులు, లాజిస్టిక్స్, విద్యుదుత్పత్తి, పంపిణీ, జాతీయ రహదారులు, రోడ్లు, వంతెనల నిర్మాణం, డేటా సెంటర్ల ఏర్పాటు వంటి కీలక రంగాల్లో ఈ లక్ష కోట్ల రూపాయల పెట్టుబడులు పెట్టనున్నట్టు వివరించారు. ఇక 'అదానీ ఆరోగ్య మందిర్' ఆసుపత్రి ప్రాజెక్టు కోసం సుమారు రూ. 4,000 కోట్లు వెచ్చించనున్నారు. ఇది పూర్తిగా లాభాపేక్ష లేని సంస్థగా పనిచేస్తుందని అదానీ స్పష్టం చేశారు. ఆసుపత్రిలోని మొత్తం 2,000 పడకల్లో 50 శాతం, అంటే 1,000 పడకలను ఆర్థికంగా వెనుకబడిన వర్గాల (ఈడబ్ల్యూఎస్) కోసం కేటాయిస్తామని, వారికి పూర్తిగా ఉచితంగా వైద్య సేవలు అందిస్తామని హామీ ఇచ్చారు. భవిష్యత్తులో ఇదే ప్రాంగణంలో ఒక మెడికల్ కాలేజీ, రీసెర్చ్ సెంటర్‌ను కూడా ఏర్పాటు చేయాలనే ప్రణాళిక ఉందని ఆయన వెల్లడించారు. ఈ నిర్ణయం రాష్ట్ర ఆరోగ్య రంగంలో కీలక ముందడుగుగా భావిస్తున్నారు.

# ఏపీ లిక్కర్ స్కామ్ కేసులో కీలక పరిణామం..

**రాజ్ కెసిరెడ్డి, వాసుదేవరెడ్డిలకు బెయిల్**

**ఏపీ లిక్కర్ స్కామ్.. కీలక నిందితులకు బెయిల్**

**రాజ్ కెసిరెడ్డి, వాసుదేవ రెడ్డిలకు ఊరట**

**ఈడీ స్పెషల్ కోర్టు బెయిల్ మంజూరు**

**దేశం విడిచి వెళ్లొద్దంటూ కఠిన షరతులు**

**రేపు జైలు నుంచి విడుదలయ్యే అవకాశం**



అమరావతి, సింధూరదర్శిని: ఆంధ్రప్రదేశ్ మద్యం కుంభకోణం (లిక్కర్ స్కామ్) కేసులో కీలక నిందితులైన రాజ్ కెసిరెడ్డి, వాసుదేవరెడ్డిలకు ఊరట లభించింది. ఈ కేసులో జ్యుడీషియల్ రిమాండ్‌లో ఉన్న రాజ్ కెసిరెడ్డి, వాసుదేవరెడ్డిలకు ఈడీ స్పెషల్ కోర్టు షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసింది. గురువారం ఈ మేరకు కోర్టు తీర్పు వెలువరించింది. బెయిల్ మంజూరు సందర్భంగా న్యాయస్థానం పలు కఠినమైన షరతులను విధించింది. నిందితులు దేశం విడిచి వెళ్లరాదని, సాక్షులను ప్రభావితం చేయకూడదని స్పష్టం చేసింది. అలాగే దర్యాప్తును ప్రభావితం చేసే ఎలాంటి చర్యలకు పాల్పడరాదని ఆదేశించింది. ఇద్దరు నిందితులు లక్ష రూపాయల చొప్పున రెండు పూచీకత్తులు సమర్పించాలని కోర్టు తన ఉత్తర్వుల్లో పేర్కొంది. వీరిద్దరూ దర్యాప్తునకు పూర్తిగా సహకరించాలని, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) విచారణకు పిలిచినప్పుడు తప్పనిసరిగా హాజరుకావాలని కోర్టు స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలో, బెయిల్ ప్రక్రియ పూర్తి చేసుకుని శుక్రవారం ఉదయం వీరిద్దరూ చంచల్‌గూడ జైలు నుంచి విడుదలయ్యే అవకాశం ఉందని తెలుస్తోంది. గత ప్రభుత్వ హయాంలో మద్యం కుంభకోణం జరిగినట్టు ఆరోపణలు రాగా, ఏపీ సీఐడీ నమోదు చేసిన కేసు ఆధారంగా ఈడీ రంగంలోకి దిగిన విషయం తెలిసిందే. ఈ స్కామ్‌లో కోట్ల రూపాయల అక్రమ లావాదేవీలు జరిగాయన్న ఆరోపణలపై దర్యాప్తు చేపట్టిన ఈడీ, రాజ్ కెసిరెడ్డి, వాసుదేవరెడ్డిలను అరెస్ట్ చేసి జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించింది. తాజాగా వీరికి బెయిల్ లభించడంతో ఈ కేసులో తదుపరి పరిణామాలు ఆసక్తికరంగా మారాయి.

# సినిమా న్యూస్

## 'ది ప్యారడైజ్' మూవీ రివ్యూ



నటీనటులు: నాని – కాయదు లోహర్ – మోహన్ బాబు – రాఘవ్ జుయల్ – సోనాలి కులకర్ణి – సంపూర్ణేష్ బాబు– ప్రియదర్శి తదితరులు సంగీతం: అనిరుధ్ రవిచందర్ ఛాయాగ్రహణం: సీహెచ్ సాయి నిర్మాత: సుధాకర్ చెరుకూరి రచన – దర్శకత్వం: శ్రీకాంత్ ఓదెల దసరా సినిమాతో సంచలనం రేపిన నేచురల్ స్టార్ నాని.. శ్రీకాంత్ ఓదెల కలిసి చేసిన 'ది ప్యారడైజ్' ఆరంభం నుంచే మాంచి హైప్ తెచ్చుకుంది. భారీ అంచనాల మధ్య ఈ రోజే ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ సినిమా అందరూ అనుకున్నట్లే నాని కెరీర్ ను నెక్స్ట్ లెవెల్ కు తీసుకెళ్లే స్థాయిలోనే ఉందా? తెలుసుకుందాం పదండి. కథ: తమకంటూ ఏ గుర్తింపు లేని సవారీ అనే జాతిలో పుట్టిన కుర్రాడు జడల్ (నాని). అతడి తల్లి సమ్మక్క (సోనాలి కులకర్ణి). ఈ సవారీలు అంటే అందరికీ చిన్నచూపే. వాళ్ళను మనుషుల్లా గుర్తించరు. వీళ్లుండే ప్యారడైజ్ ప్రాంతాన్ని శిఖంజ మాలిక్ (మోహన్ బాబు) ఏలుతుంటాడు. సవారీల మీద శిఖంజకు ఉన్న వ్యతిరేకత వల్ల.. అతడికి భయపడి ప్రభుత్వ వ్యవస్థ ఏమాత్రం సహకరించదు. సమ్మక్క తమ జాతి గుర్తింపు కోసం పోరాడుతుంటే.. జడల్ మాత్రం ఒక కారణం వల్ల తల్లి మీద ద్వేషంతో ఇదేమి పట్టనట్లు ఉండిపోతాడు. ఐతే శిఖంజ కొడుకుతో వైరం పెట్టుకున్న జడల్.. ఒక సందర్భంలో తల్లి మీద అభిప్రాయం మార్చుకుని ఆమె చేస్తున్న పోరాటంలో భాగం అవుతాడు. మరి శిఖంజతో పోరాటంలో జడల్ గెలిచాడా? సవారీలు కోరుకున్న గుర్తింపును సంపాదించి పెట్టాడా? అన్నది మిగతా కథ. కథనం – విశ్లేషణ: కథనం – విశ్లేషణ: 'ఛత్రపతి'లో వలస జీవుల అస్తిత్వం కోసం పోరాడతాడు హీరో. 'కేజీఎఫ్'లో బానిస బతుకుల విముక్తి కోసం నిలబడతాడు కథానాయకుడు. 'పుష్ప'లో తన ఐడెంటిటీ కోసమే కొట్లాడతాడు హీరో. ఈ మధ్య 'పెద్ది'లో కథానాయకుడు కూడా తన ఊరికి ఒక గుర్తింపు క్షవాలంటూ పోరాటం చేస్తాడు. ఈ కథలన్నీ ప్రేక్షకులను మెప్పించినవే. కొంచెం నేపథ్యం మార్చి.. ప్రేక్షకులను కాస్త భిన్నమైన ప్రపంచంలోకి తీసుకెళ్లి.. కథలోని ఎమోషన్ ను ఫీలయ్యేలా చేయగలిగితే.. ఇవే కథల్ని తీసినా చూస్తారు జనం. ఎమోషన్ పండితే.. ఎలివేషన్ క్లిక్ అయితే ఆ కథల రేంజే మారిపోతుంది. 'ది ప్యారడైజ్'లో శ్రీకాంత్ ఓదెల చెప్పిన కథ కూడా ఇలాంటిదే. తమకంటూ ఏ గుర్తింపు లేని ఒక జాతి.. ఆ గుర్తింపు కోసం చేసే పోరాటం.. ఆ క్రమంలో ఎదిగే ఒక నాయకుడు.. ఇలా ఫెమిలియర్ లైన్లోనే నడిచే 'ది ప్యారడైజ్' కథను డిఫరెంట్ స్టైల్లో చెప్పాలని చూశాడు శ్రీకాంత్. ఇందుకోసం అతను ఎంచుకున్న స్టైల్.. వయొలెన్స్. కానీ ఆ వయొలెన్స్ మరీ శ్రుతిమించిపోవడం.. కథలోని ఎమోషన్ అనుకున్నంతగా పండకపోవడం.. హీరో–విలన్ రెండు పాత్రలూ అనుకున్నంతగా క్లిక్ కాకపోవడంతో 'ది ప్యారడైజ్' అంచనాలను అందుకోలేకపోయింది. విడివిడిగా కొన్ని ఎపిసోడ్లు బాగున్నప్పటికీ.. ఓవరాల్ గా ఈ సినిమా నిరాశపరుస్తుంది. ఒకప్పుడు నానిని మాస్ అవతారంలో ఊహించుకోలేకపోయేవాళ్లం. కానీ చిన్న చిన్నగా మాస్ అడుగులు వేసుకుంటూ వచ్చిన అతను.. మాస్ హీరోగా ప్రేక్షకుల ఆమోదం పొందాడు. 'దసరా' సినిమాలో అయితే మరీ ఊర మాస్ క్యారెక్టర్ తోనూ ఆకట్టుకున్నాడు. పాత్రలో ఉన్న బలం.. కన్విన్సింగ్ గా అనిపించిన నాని పెర్ఫామెన్స్.. ఆ క్యారెక్టర్ కు ప్రేక్షకులు జైకొట్టేలా చేశాయి. పాత్రతో ప్రేక్షకులకు ఎమోషనల్ కనెక్ట్ ఏర్పడేలా చేయడాన్ని బట్టి ఇలాంటి మాస్ పాత్రలు క్లిక్ అవుతాయి. ఆ కనెక్ట్ ఏర్పడనపుడు టేకింగ్ ద్వారా ఎంత మ్యాజిక్ చేయాలని చూసినా.. హీరో ఎంత ఎఫర్ట్ పెట్టి గొప్పగా పెర్ఫామ్ చేసినా రావాల్సిన ఎఫెక్ట్ రాదు. 'ది ప్యారడైజ్'లో అదే జరిగింది. ఇప్పుడు హీరో కొడితే బాగుండు అని ప్రేక్షకులకు అనిపించినపుడు.. వాళ్లలో ఒక కసి రేగేలా సన్నివేశాన్ని బిల్డ్ చేసినపుడు.. హీరో విజృంభించాడంటే ఎలివేషన్ పండుతుంది. కానీ ఇక్కడ మాత్రం తెరపై హీరో వీర లెవెల్లో విధ్వంసం సృష్టిస్తున్నా ప్రేక్షకుల్లో ఉద్వేగం కలగదు. సన్నివేశాల టేకింగ్ అదిరిపోయినప్పటికీ వయొలెన్స్ వెనుక ఎమోషన్ మిస్ అవ్వడంతో సన్నివేశాలు అతిగా అనిపిస్తాయి. తన కథను కొంచెం పచ్చిగా చూపించాలనే దర్శకుడి ప్రయత్నాన్ని తప్పుబట్టలేం కానీ.. ఆ క్రమంలో మరీ హద్దులు దాటిపోవడంతో కొన్ని సన్నివేశాలను తట్టుకోవడం కష్టమవుతుంది. ఒకవైపు నాని.. ఇంకోవైపు మోహన్ బాబు.. మరోవైపు 'కిల్' ఫేమ్ రాఘవ్ జుయల్.. ఇలాంటి ఆర్టిస్టులకు సరైన పాత్రలు పడితే.. వాళ్లే సినిమాను వేరే లెవెల్ కు తీసుకెళ్లిపోయేవారు. కానీ సోనాలి కులకర్ణి చేసిన హీరో తల్లి పాత్ర క్లిక్ అయినట్లుగా.. వీళ్ల పాత్రలు కుదరలేదు. విలన్ల పాత్ర ఎంత బలంగా ఉంటే హీరో క్యారెక్టర్ అంత క్లిక్ అవుతుందన్నది వాస్తవం. కానీ ఇక్కడ ప్రతినాయకుల పాత్రల్లో బలం తగ్గింది. శిఖంజ మాలిక్ ఒక రాక్షసుడు అని మాటల్లో చూపించడమే తప్ప.. ప్రేక్షకులకు భయంగొలిపేలా ఆ పాత్రను తీర్చిదిద్దలేదు. కొడుకు పాత్ర అయితే మరీ వీక్. ఈ క్యారెక్టర్లు అంతంతమాత్రంగా అనిపించడంతో.. వాళ్లను ఢీకొట్టే హీరో పాత్ర కూడా ఎలివేట్ కాలేదు. హీరో మీద 'లం..కొడుకు' అనే ముద్ర పడడానికి కారణం చూపిస్తూ నడిపించిన బ్యాక్ స్టోరీ మాత్రం పండింది. ఈ ఎపిసోడ్ వల్ల 'ది ప్యారడైజ్' మొదట్లో చాలా ప్రామిసింగ్ గా అనిపిస్తుంది. తల్లీకొడుకుల ఎమోషన్ కూడా బాగా వర్కవుట్ అయింది. సినిమాలో కథ పరంగా ఇదే మేజర్ హైలైట్. దానివల్లే ఇంటర్వెల్ ఎపిసోడ్ పేలింది. ఐతే సవారీల తాలూకు బాధను కూడా ఇలాగే బలంగా చూపించాల్సింది. కానీ ఆ ట్రాక్ పండలేదు. హీరో–విలన్ మధ్య కాన్ఫ్లిక్ట్ కి సంబంధించిన సన్నివేశాలను కూడా సరిగా తీర్చిదిద్దుకోలేదు దర్శకుడు. సవారీల ప్రపంచాన్ని సరిగా ప్రెజెంట్ చేయడంలో... వారి బాధలను గుండెకు హత్తుకునేలా చెప్పడంలో దర్శకుడు తడబడ్డాడు. హీరో పాత్రతో ప్రేక్షకులకు బలమైన ఎమోషనల్ కనెక్షన్ ఏర్పడలేదు. ఇక్కడే శ్రీకాంత్ ఓదెల గురువు సుకుమార్ 'పుష్ప' సినిమాలో హీరో పాత్రతో ప్రేక్షకుల్లో ఎలాంటి ఎమోషన్ తీసుకురాగలిగాడో గుర్తు చేసుకోవాలి. ఆ ఎమోషనే ఇక్కడ మిస్ అయింది. ముందే అన్నట్లు 'ది ప్యారడైజ్'లో విడివిడిగా చూస్తే కొన్ని ఎపిసోడ్లు ఆకట్టుకుంటాయి. ముఖ్యంగా ఇంటర్వెల్ బ్యాంగ్ మాస్ ప్రేక్షకులు కోరుకునే హై ఇస్తుంది. తల్లి–కొడుకు మధ్య సన్నివేశాలు బాగానే పండాయి. యాక్షన్ ఘట్టాలన్నింటినీ బాగా తీశాడు శ్రీకాంత్ ఓదెల. హీరో ఎలివేషన్ సీన్లు కూడా ఓకే అనిపిస్తాయి. కాకపోతే హింస మితిమీరిపోవడం వల్ల వాటిని అన్ని వర్గాల ప్రేక్షకులూ ఎంజాయ్ చేయలేదు. కొంచెం ఎగుడుదిగుడుగానే ఉన్నప్పటికీ.. హీరోయిజం బాగా పండిన ఇంటర్వెల్ బ్యాంగ్ వల్ల ప్రథమార్ధం వరకు 'ది ప్యారడైజ్' ఓకే అనిపిస్తుంది. కానీ రెండో అర్ధం మాత్రం బాగా నిరాశపరుస్తుంది. నాని–మోహన్ బాబు ఫేసాఫ్ గురించి ఎంతో ఊహించుకుంటాం కానీ.. ఆ సన్నివేశం పండకపోవడంతో ఆ ప్రభావం ద్వితీయార్ధం మీద గట్టిగా పడింది. మోహన్ బాబు పాత్ర క్లిక్ కాకపోవడంతో.. నాని క్యారెక్టర్ కూడా అనుకున్నంతగా ఎలివేట్ కాలేదు. సవారీల తిరుగుబాటు నేపథ్యంలో నడిచే సన్నివేశాల్లో బలం లేకపోయింది. ప్రియదర్శి చేసిన కేసీఆర్ పాత్ర కొంత జోష్ తెస్తుంది. యేషనాగుల పాటకు టైమింగ్ కుదరలేదు కానీ ఆ సాంగ్ ఒక ఊపు ఊపేస్తుంది. ఇవి తప్పితే.. ద్వితీయార్ధం చాలా వరకు నిరాశపరుస్తుంది. క్లైమాక్స్ భారీగా తీసినా సరే.. అది ఇవ్వాల్సిన హై ఇవ్వలేదు. ఓవరాల్ గా చెప్పాలంటే.. కొన్ని ఎపిసోడ్ల వరకు ఓకే అనిపించినా.. 'దసరా' కాంబినేషన్ నుంచి ఆశించే సినిమా కాదు.. 'ది ప్యారడైజ్'. నటీనటులు: నాని 'దసరా'ను మించిన ఊర మాస్ పాత్రకు న్యాయం చెయ్యడానికి ఎంతో కష్టపడ్డాడు. పెర్ఫార్మెన్స్ పరంగా నాని తన క్యారెక్టర్ కోసం ఏమివ్వాలో అదంతా ఇచ్చాడు. అతడి ఎఫర్ట్ గురించి ఎంత చెప్పినా తక్కువే. కానీ గత కొన్నేళ్లలో ఎంత మాస్ ఇమేజ్ తెచ్చుకున్నా సరే.. మరీ మాస్ భారం ఎక్కువైపోవడంతో జడల్ పాత్రను మొయ్యలేకపోయాడు. ఈ పాత్ర అతడికి అంతగా సూట్ కాలేదనిపిస్తుంది. నాని నుంచి మరీ ఇంత వయొలెన్స్ అంటే తనను ఎంతో అభిమానించే ఫ్యామిలీ ఆడియన్స్ తట్టుకోవడం కష్టమే. హీరోయిన్ కాయదు లోహర్ కి భిన్నమైన పాత్రే దక్కింది. తన పెర్ఫార్మెన్స్ బాగుంది. లుక్ కూడా ఆకట్టుకుంటుంది. తన గ్లామర్ ను ఉపయోగించుకునేలా పాత్రను డిజైన్ చేశాడు దర్శకుడు. కానీ ఆమె పాత్ర మిక్స్డ్ ఫీలింగ్ ఇస్తుంది. మోహన్ బాబు చేసిన శిఖంజ మాలిక్ పాత్ర కూడా అంచనాలకు తగ్గట్లు లేదు. ఆయన రేంజికి ఇంకా పవర్ ఫుల్ రోల్ ఆశిస్తాం. తన డైలాగ్ డెలివరీతో కొన్ని చోట్ల మాలిక్ పాత్రకు బలం తెచ్చారు కానీ.. ఓవరాల్ గా క్యారెక్టర్ ఆర్క్ సరిగా లేకపోవడంతో మోహన్ బాబు బలమైన ముద్ర వేయలేక పోయారు. ఇక కథలో అత్యంత కీలకమైన హీరో తల్లి పాత్రలో బాలీవుడ్ నటి సోనాలి కులకర్ణి గొప్పగా నటించింది. సినిమాలో బెస్ట్ పెర్ఫార్మర్ ఆమే. నానిని కూడా ఆమె డామినేట్ చేసింది. రాఘవ్ జుయల్ కి ప్రోమోల్లో ఇచ్చిన బిల్డప్ సినిమాలో లేదు. తన లుక్ మీద పెట్టిన శ్రద్ధ పాత్ర మీద పెట్టలేదు. తన యాక్టింగ్ బాగున్నా పాత్రలో దమ్ము లేకపోయింది. బిర్యానీ పాత్రలో సంపూర్ణేష్ బాబు జస్ట్ ఓకే అనిపించాడు. సాంకేతిక వర్గం: అనిరుధ్ రవిచందర్ మీద ఫ్యాన్స్ పెట్టుకునే అంచనాలకు అతను తగ్గలేదు. ఆయా షేర్.. యేషనాగుల కట్ట.. సమ్మక్క.. ఈ పాటలన్నీ అదిరిపోయాయి. బీజీఎం విషయంలో కూడా అనిరుధ్ బాగానే డ్యూటీ చేశాడు కానీ కొన్నిచోట్ల సౌండ్ మరీ ఎక్కువైంది. సీహెచ్ సాయి ఛాయాగ్రహణం బాగుంది. ప్రొడక్షన్ వాల్యూస్ కి ఏమి లోటు లేదు. భారీగా ఖర్చు పెట్టారు. ఎంతైనా ఖర్చు పెట్టే నిర్మాత.. ఎంతైనా కష్టపడే హీరో.. ఇంకా కోరుకున్న అన్ని వనరులు సమకూరినా.. రైటర్ – డైరెక్టర్ శ్రీకాంత్ ఓదెల ఉపయోగించుకోలేక పోయాడు. ఎన్నోసార్లు చూసిన కథకే మేకప్ వెయ్యాలని.. టేకింగ్ తో మ్యాజిక్ చెయ్యాలని చూశాడు కానీ ఆశించిన ఫలితం రాలేదు. కొన్ని ఎపిసోడ్ల వరకు ఓకే అనిపించినా ఓవరాల్ గా శ్రీకాంత్ తనపై నెలకొన్న భారీ అంచనాలను అందుకోలేకపోయాడు.

చివరగా: ప్యారడైజ్..

మాస్ ఓవర్ డోస్ రేటింగ్ –2.25/5

## 'సిగ్మా' ప్రీ రిలీజ్ ఈవెంట్.. చీఫ్ గెస్టుగా చిరంజీవి




- తమిళనాడు సీఎం విజయ్ కుమారుడు జాసన్ సంజయ్ దర్శకత్వంలో వస్తున్న 'సిగ్మా'
- హీరోగా నటిస్తున్న సందీప్ కిషన్, హీరోయిన్‌గా ఫరియా అబ్దుల్లా
- హైదరాబాద్‌లో జరగనున్న ప్రీ-రిలీజ్ ఈవెంట్‌కు ముఖ్య అతిథిగా మెగాస్టార్ చిరంజీవి
- ప్రముఖ నిర్మాణ సంస్థ లైకా ప్రొడక్షన్స్ నిర్మిస్తున్న ఈ చిత్రం అక్టోబర్ 2న విడుదల
- తెలుగు రాష్ట్రాల్లో ఈ సినిమాను విడుదల చేస్తున్న మైత్రీ మూవీ మేకర్స్

యంగ్ హీరో సందీప్ కిషన్ నటిస్తున్న తాజా చిత్రం 'సిగ్మా' ప్రమోషన్ కార్యక్రమాలు ఊపందుకున్నాయి. రేపు (సెప్టెంబర్ 25) హైదరాబాద్‌లో జరగనున్న 'సిగ్మా' ప్రీ రిలీజ్ వేడుకకు టాలీవుడ్ మెగాస్టార్ చిరంజీవి ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. ఈ విషయాన్ని చిత్ర నిర్మాణ సంస్థ లైకా ప్రొడక్షన్స్ అధికారికంగా సోషల్ మీడియా ద్వారా వెల్లడించింది. మెగాస్టార్ రాకతో సినిమాకు భారీ హైప్ వచ్చినట్టయింది. ఈ సినిమాకు ఉన్న మరో ప్రధాన ఆకర్షణ ఏంటంటే.. తమిళనాడు సీఎం విజయ్ కుమారుడు జాసన్ సంజయ్ ఈ చిత్రంతో దర్శకుడిగా అరంగేట్రం చేస్తున్నాడు. తన తొలి సినిమాతోనే అతడు తెలుగు ప్రేక్షకులను పలకరించనుండటం విశేషం. హైదరాబాద్‌లోని పార్క్ హయత్‌లో శుక్రవారం సాయంత్రం 6 గంటల నుంచి ఈ ప్రీ-రిలీజ్ వేడుకను ఘనంగా నిర్వహించనున్నారు. ప్రముఖ నిర్మాణ సంస్థ లైకా ప్రొడక్షన్స్ పతాకంపై సుభాస్కరన్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఇందులో సందీప్ కిషన్‌కు జోడీగా 'జాతిరత్నాలు' ఫేమ్ ఫరియా అబ్దుల్లా నటిస్తోంది. స్టార్ మ్యూజిక్ డైరెక్టర్ తమన్ ఈ చిత్రానికి సంగీతం అందిస్తున్నారు. తెలుగు రాష్ట్రాల్లో ఈ సినిమా పంపిణీ హక్కులను ప్రముఖ నిర్మాణ సంస్థ మైత్రీ మూవీ మేకర్స్ సొంతం చేసుకోవడం సినిమాపై అంచనాలను మరింత పెంచుతోంది. గాంధీ జయంతి సందర్భంగా అక్టోబర్ 2న 'సిగ్మా' చిత్రం థియేటర్లలో విడుదల కానుంది. విడుదల తేదీ దగ్గర పడుతున్న తరుణంలో, మెగాస్టార్ చిరంజీవి ముఖ్య అతిథిగా వస్తుండటంతో ఈ ఈవెంట్ సినిమాకు కావాల్సినంత ప్రచారాన్ని అందిస్తుందని విశ్లేషకులు భావిస్తున్నారు.



మీనాక్షి చౌదరి కలలు కనే వెకేషన్ క్లిక్‌లను పంచుకుంది, సాధారణమైన కానీ సొగసైన దుస్తులలో, మీనాక్షి అప్రయత్నంగా శైలితో సౌకర్యాన్ని మిళితం చేస్తుంది, ప్రయాణించేటప్పుడు కూడా ఆమె శుద్ధి చేసిన ఫ్యాషన్ సెన్సిబిలిటీని ప్రతిబింబిస్తుంది.

## జీవితాంతం నీవు నా దగ్గరే ఉంటావు: విజయ్ దేవరకొండ



రియల్ లైఫ్ జంట విజయ్ దేవరకొండ, రష్మిక మందన్న కలిసి నటిస్తున్న పీరియాడిక్ యాక్షన్ డ్రామా 'రణబాలి' సినీ అభిమానుల్లో తీవ్ర ఆసక్తిని రేకెత్తిస్తోంది. ఈ సినిమాలో విజయ్ దేవరకొండ 'సింగనమల బొబ్బిలి రణబాలి'గా పవర్‌ఫుల్ పాత్రలో అలరించనుండగా, ఆయనకు జోడీగా రష్మిక 'జయమ్మ' పాత్రలో నటిస్తోంది. ఇటీవల విడుదలైన 'ఏందయ్యా సామీ..' పాట యూట్యూబ్‌తో పాటు సోషల్ మీడియా వేదికగా విశేష ప్రజాదరణ పొందుతోంది. తాజాగా, ఈ పాటలోని ఒక రొమాంటిక్ క్లిప్‌ను రష్మిక తన ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేస్తూ... అతను పూర్తిగా తనకే సొంతమయ్యాడని, కానీ అతనిపై ఉన్న క్రష్ మాత్రం ఏమాత్రం తగ్గలేదని కామెంట్ చేసింది. దీనికి విజయ్ దేవరకొండ రిప్లై ఇస్తూ... "నేను ఎంతో అదృష్టవంతుడిని. నేను జయమ్మని మిస్ అవుతాను కానీ.. జీవితాంతం నువ్వు నా దగ్గరే ఉంటావు" అని ఎంతో ప్రేమగా స్పందించాడు. ఈ సరదా సంభాషణ వారి మధ్య ఉన్న అనుబంధం చూసి అభిమానులు మురిసిపోతున్నారు. మరోవైపు, ఈ సినిమాకు రాహుల్ సాంకృత్యన్ దర్శకత్వం వహిస్తుండగా... మైత్రీ మూవీ మేకర్స్ ఈ చిత్రాన్ని నిర్మిస్తోంది. దసరా కానుకగా అక్టోబర్ 16న ప్రేక్షకుల ముందుకు రాబోతోంది.

Printed by:KALICHETI VENKAIAH, KADIVEDU VILLAGE AND POST, CHILLAKURU MANDAL, TIRUPATI Dist, A.P-524410. Published by:KALICHETI VENKAIAH, KADIVEDU VILLAGE AND POST, CHILLAKURU MANDAL, TIRUPATI Dist, A.P-524410. Owned by:KALICHETI VENKAIAH, KADIVEDU VILLAGE AND POST, CHILLAKURU MANDAL, TIRUPATI Dist, A.P-524410. Printed at:SINDHURA DARSINI PUBLICATION, KADIVEDU VILLAGE AND POST, CHILLAKURU MANDAL, TIRUPATI Dist, A.P-524410. Editor: KALICHETI VENKAIAH, KADIVEDU VILLAGE AND POST, CHILLAKURU MANDAL, TIRUPATI Dist, A.P-524410. Email:SINDHURADARSINI.2023@Gmail.com, Cell:7569677170,RNI/APTEL/2023/87662